بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

సంపుటి 6 సంచిక 31

వార్షిక చందా 575/-రూ॥

05 ఆగష్టు, 2021 క్రీ, శ. 05 జహూర్ 1400 హి, శ.

25 జుల్ హజ్ 1442 హి, ఖ.

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! (ఆమీన్).

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّہَا الرَّسُوۡلُ بَلِّغۡ مَاۤ اُنۡزِلَ اِلَیۡکَ مِنۡ رَّبِّکَ ؕ وَاِنۡ لَّمۡ تَفۡعَلۡ فَمَا بَلَّغۡتَ رِسَالَتَہٗ ؕ وَاللّٰہُ یَعۡصِمُکَ مِنَ النَّاسِ ؕ اِنَّ اللّٰہَ لَا یَہۡدِی الۡقَوۡمَ الۡکٰفِرِیۡنَ (المائدہ:68)

అనువాదం: ఓ ప్రవక్తా! నీ ప్రభువు నుండి నీకు అవతరింపజేసిన దానిని మంచిగా తెలియజేయుము. నీవు ఇట్లు చేయనిచో అతని సందేశమును అంద జేయని వాడవగుదువు. అల్లాహ్ నిన్ను మనుషుల నుండి కాపాడును. నిశ్చయముగా అల్లావ్ అవిశ్వాస జాతికి వార్గ దర్శనము చూపడు.( మాయిదా: 68).

**నేను అల్లాహ్ తాలా ప్రమాణ పూర్వకముగా తెల్పునదేమనగా, అల్లాహ్ తాలా నన్ను ఒక అవతార పురుషుడిగా అవతరింపజేశాడు. ఒకవేళ ఈ ప్రజల మనస్సులో దైవవైభవపు ప్రభావం ఏ కొద్దిగానైన ఉన్నకూడ వారు అస్సలు తిరస్కరించేవారు కాదు.**

**ఉపదేశము: సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం.**

### సత్కార్యముల గుర్తింపు:-

ఇస్లాంకు విరుద్ధమైన ఏ ఏ అంశాలు మనలో కొనసాగుతున్నాయి అనే విషయాన్ని ఈ ప్రజలు అర్థం చేసుకోవడం లేదు. మేము లా ఇలాహ్ ఇల్లల్లాహు అని పలుకుతున్నాము, నమాజ్‌లు చేస్తున్నాము, ఉపవాసములు పాటిస్తుంటాము, జకాత్‌లు చెల్లిస్తున్నాము అని చెప్పుకొస్తుంటారు. కాని ఈ సందర్భముగా నేను తెల్పునదేమనగా, వారు ఆచరిస్తున్న ఈ ఆచరణలు సత్కార్యముల రూపంలో లేవు. అవి కేవలం పలుకు లేని ఒక పొట్టును పోలినట్లుగానే ఉన్నాయి. లేనిచో ఒకవేళ వారి ఆచరణలు సత్కార్యములే అయినచో వాటి ఉత్తమ ప్రయోజనాలు వారికి ఎందుకు అందడం లేదు?. అన్ని రకాల విపత్తుల నుండి, మలినాల నుండి పరిశుద్ధం చేయబడినప్పుడే అవి సత్కార్యములనబడుతాయి. కాని వారిలో ఈ ప్రత్యేకతలు ఎక్కడ ఉన్నాయి?. నాకు ఏ మాత్రం నమ్మకం కలుగని విషయమేమనగా, ఒక విశ్వాసుడు దైవభీతిని కల్గియుండి, సత్కార్యములు చేస్తూకూడ సత్యవంతులకు శత్రువుగా నిలవడం. వాస్తవానికి వీరు మమ్ములను తిరుగుబోతు అని, నాస్తికుడని పిలుస్తుంటారు. పైగా వీరు దేవునికి ఏ మాత్రం భయపడరు. నేను అల్లాహ్ తాలా ప్రమాణ పూర్వకముగా తెల్పునదేమనగా, అల్లాహ్ తాలా నన్ను ఒక అవతార పురుషుడిగా అవతరింపజేశాడు. ఒకవేళ ఈ ప్రజల మనస్సులో దైవవైభవపు ప్రభావం ఏ కొద్దిగానైన ఉన్నకూడ వారు అస్సలు తిరస్కరించేవారు కాదు. పైగా వారు తామెక్కడ దేవుని పేరును కనుమరుగు చేయువారము అవుతామోనని అతనికి భయపడేవారు. కాని ఇలా వారిలో నిజమైన, ఉన్నతమైన విశ్వాసం అల్లాహ్ తాలాపై ఉన్నప్పుడు, అదే విధముగా ప్రతిఫలము లభించు దినము పట్ల భయము కల్గియున్నప్పుడు, మరల లా తఖ్ఫు మా లైసలక బిహి ఇల్‌మున్ (బనీ ఇస్రాయీల్: 37)కు అనుగుణముగా ఆచరిస్తున్నప్పుడు మాత్రమే జరుగుతుంది.

### దైవజనుల తిరస్కారము విశ్వాస ఘాతానికి కారణ మవుతుంది:-

వారి మేథోశక్తి, విశ్వాస పటిష్టత వారిని ఏ స్థాయికి చేరవేసిందనగా, ప్రవక్తను తిరస్కరించిన వారు అవిశ్వాసులు అవుతారు కాని, దైవజనులను తిరస్కరించిన వారు ఏ విధముగా అవిశ్వాసులు అవుతారు అని ప్రశ్నింస్తుంటారు. ఒక్క వ్యక్తిని తిరస్కరించినంత మాత్రమున ఏమి అవుతుందిలే అని వారు భావిస్తుంటారు. వారు దైవజనుల తిరస్కారమును సాధారణ విషయముగా భావిస్తుంటారు. దాని వలన ఏమి నష్టం జరుగుతుంది? అని ప్రశ్నింస్తుంటారు. కాని వాస్తవమేమనగా, దైవజనులను తిరస్కరించుట విశ్వాస ఘూతానికి కారణమవుతుంది. ఏ వ్యక్తి అయినా ఈ విషయంను క్షుణ్ణముగా పరిశీలించి చూసినచో వారికి ఎంతో స్పష్టముగా ఈ విషయం అర్థమవుతుంది. ఎంత సృష్టముగా కనిపిస్తుందనగా, అద్దంలో వ్యక్తి రూపం కనిపించినట్లుగా కనిపిస్తూ ఉంటుంది.

గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, విశ్వాస ఘూతకం రెండు విధాలలో జరుగుతుంది. మొదటిది ప్రవక్తలను తిరస్కరించడం ద్వారా, ఈ విషయాన్ని ఎవరు కూడ కాదనలేరు. ఇది అక్షర సత్యం. రెండవది దైవజనులు మరియు సంస్కర్తలను తిరస్కరించడం ద్వారా విశ్వాస ఘూతకం జరుగుతుంది.

ప్రవక్తలను తిరస్కరించడం వలన విశ్వాసం నాశనమవుతుందనే విషయం ఎంతో స్పష్టమైనది. ఈ విషయం అందరికి తెలుసు. కాని మరల గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, ప్రవక్తలను తిరస్కరించడం వలన విశ్వాసం ఎందుకు నాశనమవుతుందనగా, ప్రవక్తలు వేము దేవుని వైపు నుండి అవతరించాము అని తెల్పుతారు. అంతేగాకా అల్లాహ్ తాలా కూడ వీరు ఏ విషయాలను తెల్పుచున్నారో అవి నా మాటలు అని తెల్పుచు వారిని బలపరుస్తాడు. ఇతడు నా ప్రవక్త, ఇతన్ని విశ్వసించుము. నా గ్రంథమును విశ్వసించుము అని, నా ఆదేశాలకు అనుగుణముగా నడుచుకొనుము అని ఆదేశిస్తాడు. కావున ఎవరైతే అల్లాహ్ తాలా గ్రంథాన్ని విశ్వసించకుండా, ఆ గ్రంథములో పేర్కొన్నటు వంటి మార్గదర్శకాలు మరియు ఆదేశాలను పాటించకుండా ఉంటారో వారు వాటిని తిరస్కరించిన వారగుదురు. అందు వలన వారు అవిశ్వాసులు అవుతారు. కాని దైవజనులను తిరస్కరించడం వలన ఎందుకు అవిశ్వాసులు అవుతారు అనే విషయానికి కారణం మరొకటి ఉన్నది. ఒక హదీస్‌లో ఈ విధముగా పేర్కొనడం జరిగింది. మన్ ఆద లివలియ్యన్ ఫ ఆజన్‌తుహు లిల్ హర్బి అనగా ఎవరైతే నా స్నేహితుడితో శత్రుత్వంను వహిస్తాడో అతడు నాతో యుద్ధానికి సిద్ధమవుతున్నట్లే అని అల్లాహ్ తాలా ప్రకటిస్తున్నాడు.

**(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 313, ప్రచురణ 2018, ఖాదియాన్).**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

### జకాత్ చెల్లించు ప్రతిజ్ఞ:-

(1401) హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ రజియల్లాహ్ అన్‌హు ఇలా ఉల్లేఖించారు: నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఏకాగ్రతతో నమాజ్‌ను చదువుతానని, జకాత్ చెలిస్తానని మరియు ప్రతి ముసల్మానుడి శ్రేయస్సును కోరుకుంటానని ప్రతిజ్ఞ చేశాను.

### జకాత్ చెల్లించనిచో పాపము:-

(1402) హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహ్ అన్‌హు ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: (ప్రళయదినమున) ఒంటెలు తమ యజమాని వద్దకు భూలోకంలో ఉన్నట్లుగానే బలిష్ఠ స్థితిలో వచ్చును. ఒకవేళ ఆ యజమాని వాటి హక్కుల(జకాత్)ను చెల్లించి ఉండనిచో అవి తమ యజమానిని తమ కాళ్ళలతో త్రొక్కుతాయి. అదే విధముగా మేకలు కూడ భూలోకంలో ఉన్న స్థితిలోనే తమ యజమాని వద్దకు చేరుకుంటాయి. ఒకవేళ వాటి యజమాని వాటి హక్కుల(జకాత్)ను చెల్లించి ఉండనిచో అవి తమ యజమానిని కొమ్ములతో పొడుస్తూ, కాళ్ళతో త్రొక్కుతాయి. మరల ఇలా తెలిపారు: ప్రళయ దినమున మీ మేకలు మిమ్ములను తమ మెడలపై మోస్తూ, అరుస్తూ వచ్చు నట్టి స్థితిలో మీలో ఎవరు కూడ ఉండకూడదు. ఆ సమయంలో మీరు నన్ను ఓ ముహమ్మద్! ఓ ముహమ్మద్! అని పిలిచిన కూడ నేను అక్కడ మీకు ఎలాంటి సహాయమును చేయలేను. నేను మీకు ఈ విషయాన్ని (సందేశాన్ని) ఎంతో స్పష్టముగా తెలియజేశాను. అదే విధముగా ప్రళయ దినమున మీ ఒంటెలు మిమ్ములను తమ మెడలపై మోస్తూ, అరుస్తూ వచ్చు నట్టి స్థితిలో మీలో ఎవరు కూడ ఉండకూడదు. ఆ సమయంలో మీరు నన్ను ఓ ముహమ్మద్! ఓ ముహమ్మద్! అని పిలిచిన కూడ నేను అక్కడ మీకు ఎలాంటి సహాయమును చేయలేను. నేను మీకు ఈ విషయాన్ని (సందేశాన్ని) ఎంతో స్పష్టముగా తెలియజేశాను.

(సహీ బుఖారి, కితాబుల్ జకాత్ సంపుటి 3, ప్రచురణ 2008, ఖాదియాన్).

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

హ్రజత్ ఉమర్ రజి ఖజా వ్యవస్థను ప్రారంభించారు. అన్ని జిల్లాలలో న్యాయస్థానాలను ఏర్పాటు చేశారు. వాటిలో న్యాయమూర్తులుగా ఖాజీలను నియమించారు. హ్రజత్ ఉమర్ రజి ఖజా కొరకు కొన్ని న్యాయపరమైన చట్టాలను కూడ రూపొందించారు.

హ్రజత్ ఉమర్ రజి ఖలీఫస్సాని ఒకసారి ఉబై బిన్ కఅబ్ రజితో తగాద పడ్డారు. ఖాజి వద్ద వ్యాజ్యము మోపబడింది. ఖాజి హ్రజత్ ఉమర్ రజిను పిలిపించారు. హ్రజత్ఉమర్ రజి ఖజాకు చేరుకున్న తరుణంలో ఖలీఫా అనే గౌరవంతో ఖాజి తన ఆస్థానం నుండి క్రిందికి వచ్చారు. హ్రజత్ ఉమర్ రజి తన ప్రత్యర్థితో కలసి కూర్చున్నారు. ఆ తరువాత ఖాజితో ఇలా అన్నారు. నీవు మొదట అన్యాయముగా వ్యవహరించావు. ఈ న్యాయస్థానంలో నా మధ్యలో నా ప్రత్యర్థి మధ్యలో ఎలాంటి తేడాలు చూపించకుండ ఉండాల్సినది అని హితబోధ చేశారు.

అదే విధముగా పోలీస్ వ్యవస్థను స్థాపించారు. దేశంలో శాంతి సామరస్యతలు నెలకొల్పడం కోసం హ్రజత్ ఉమర్ రజి పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ పోలీస్ శాఖకు శాంతి, సామర్యతలను నెలకొల్పడంతో పాటు బాజార్ల పర్యవేక్షణల బాధ్యతలను కూడ అప్పగించారు. ప్రజలు సరైన విధముగా విధి విధానాలను అనుసరిస్తున్నారా? లేదా? అని పర్యవేక్షణలు జరపడం వారి బాధ్యత.

అదే విధముగా హ్రజత్ ఉమర్ రజి బైతుల్ మాల్ వ్యవస్థను కూడ ఏర్పాటు చేశారు. హ్రజత్ ఉమర్ రజి కంటే పూర్వం సంపద ఎప్పుడు వచ్చిన కూడ వెంటనే పంపకాలు చేసేవారు. హ్రజత్ అబూబకర్ రజి ఖిలాఫత్ కాలంలో ఒక భవనాన్ని కొనుగోలు చేసి దానిని బైతుల్ మాల్ కోసం ప్రత్యేకించడం జరిగింది. కాని అది ఎప్పటికి మూసివేసి ఉండేది. ఎందుకనగా వచ్చిన సంపదను వచ్చినట్లుగానే పంచి పెట్టేవారు.

వ్యవసాయానికి అనుకూలంగా ఉండడానికి మరియు ప్రజలకు మంచి నీటి సౌకర్యాన్ని కల్పించుటకు కాలువలను త్రవ్వించారు.

హ్రజత్ ఉమర్ రజి పటిష్టముగా, సరైన విధముగా ఆయా నగరాలకు పునాదులను వేశారు. జన ఆవాస యోగ్యముగా తీర్చిదిద్దారు. ఆయ నగరాల రోడ్లను, వీధులను విశాలముగా ఉండేటట్లు చూశారు.చాలా విశాలముగా, పటిష్టముగా అందముగా ఉండేవి. వాటి నిర్మాణాలను చూసినచో వారు నిర్మాణ రంగంలో చాలా అనుభవం గలవారని, ప్రావీణ్యత గలవారని, వారికి సాటి ఎవరు లేరనే విషయం అర్థమవుతుంది.

అదే విధముగా మార్కెట్‌లో ధరలను అదుపు చేయడం లేదా విలువలను పూర్తి స్థాయిలో తగ్గించడం వంటి వాటిని హ్రజత్ ఉమర్ నివారించేవారు. హ్రజత్ ఉమర్ ఈ విషయంలో ఒక విధానాన్ని తీసుకవచ్చారు.

ఇక విద్యా విధానంను చూసినచో హ్రజత్ ఉమర్ రజి విద్యను చాలా అధికముగా ప్రోత్సహించేవారు. అన్ని దేశాలలో మదర్సాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఖుర్ఆన్ మరియు హదీస్, ఫిఖ్‌హాలను బోధించేవారు. గొప్ప గొప్ప అనుచరులను, విద్యావంతులను ఇతరులకు విద్యను నేర్పించడం కోసం నియమించారు. విద్యను బోధించేవారి కోసం జీతాలను కూడ నిర్ణయించారు.

అధిక చరిత్రకారుల దృష్టిలో అరబ్‌లో మొట్ట మొదటిసారి నాణేలను అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ ప్రారంభించెను. కాని మొట్ట మొదటి సారి ఇస్లామీయ నాణేలు హ్రజత్ ఉమర్ రజి కాలములో ప్రారంభించబడెనని పవిత్ర నగరము మదీనాకు చెందిన కొందరు చరిత్ర కారులు పొందుపర్చారు. వాటిపై అల్‌హందులిల్లాహ్ అని చెక్కబడెను. మరికొన్నిటిపై ముహమ్మద్ రసూలుల్లాహ్ అని, మరికొన్నిటిపై లాఇలాహ ఇల్లల్లాహ్ వహ్‌దహు అని చెక్కబడెవి.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 09 జులై 2021, ( 09 వఫా 1400 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِينَ ـ اَلرَّحْمٰنِ الرَّحِيمِ ـ مٰلِكِ يَوْمِ الدِّينِ ـ
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ـ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ـ
صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ ـ

ప్రస్తుతం హ్రజత్ ఉమర్ రజియల్లాహ్ తాలా అన్‌హు ప్రస్తావన కొనసాగుచున్నది. ఈ క్రమంలో వారు స్థాపించిన ఖజా వ్యవస్థను గూర్చి కొన్ని కథనాలు ఈ విధముగా గలవు: హ్రజత్ ఉమర్ రజి ఖజా వ్యవస్థను ప్రారంభించారు. అన్ని జిల్లాలలో న్యాయస్థానాలను ఏర్పాటు చేశారు. వాటిలో న్యాయమూర్తులుగా ఖాజీలను నియమించారు. హ్రజత్ ఉమర్ రజి ఖజా కొరకు కొన్ని న్యాయపరమైన చట్టాలను కూడ రూపొందించారు. (అల్‌ఫారూఖ్, షుబ్లీ నుఅమాని, పుట 195–198, ఇదార ఇస్లామియాతు కరాచి 2004).

ఖాజిల నియామకంలో ధర్మశాస్త్రములో ఆరితేరిన పండితులను ఎంపిక చేసేవారు. అలా అని హ్రజత్ ఉమర్ రజి ధర్మపండితులని చాలించకుండా క్రమబద్దముగా వారికి పరీక్షలు కూడ నిర్వహించేవారు. ప్రలోభాలకు లోబడకుండా న్యాయబద్ధముగా తీర్పులు ఇవ్వడం కోసం ఖాజీలకు పెద్ద మొత్తంలో జీతాలను నిర్ణయించారు. తీర్మాణం చేయునప్పుడు ప్రత్యర్థుల ప్రభావానికి లోనవకుండా ఉ ండడం కోసం ధర్మశాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణులైన ధనవంతులను, ఉన్నత వంశస్థులను ఖాజీలుగా నియమించేవారు. హ్రజత్ ఉమర్ రజి న్యాయస్థానంలో సమానత్వమును, పారదర్శకతను పాటించాలని ఖాజీలకు పదే పదే సూచనలు ఇచ్చేవారు. ఒకసారి హ్రజత్ ఉమర్ రజి హ్రజత్ ఉబై బిన్ కఅబ్ రజితో ఏదో విషయంలో గొడవ పడ్డారు. హ్రజత్ ఉబై రజి జైద్ బిన్ సాబిత్ రజి న్యాయస్థానములో వ్యాజ్యమును వేశారు. జైద్ వ్యాజ్యపు పుర్వాపరాలను పరిశీలించు క్రమంలో హ్రజత్ ఉమర్ రజి మరియు ఉబై రజిలను పిలిపించారు. ఆ సమయంలో హ్రజత్ ఉమర్ రజిను గౌరవించుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాని హ్రజత్ ఉమర్ రజి మాత్రం ఉబై రజితో పాటు కలిసి కూర్చుంటూ, ఇది నీవు చేసిన మొదటి దౌర్జన్యం అని జైద్ రజిను హెచ్చరించారు. (అల్ ఫారూఖ్, షుబ్లీ నుఅమాని, పుట 199–200, ఇదారహ్ ఇస్లామియాత్ కరాచి 2004).

అనగా తాము ఇద్దరు పిర్యాధు దారులని, కావున ఇరువుని పిర్యాదు దారులవలెనే చూడాలని, ఇరువురిని ప్రక్క ప్రక్కనే కూర్చోబెట్టాలి గాని, ఇలా వేరుగా గౌరవమర్యాదలు చేయకూడదని ఇది అన్యాయమని చెప్పారు.

హ్రజత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఈ ఘటనను గూర్చి తెల్పుచూ ఇలా పేర్కొన్నారు: హ్రజత్ ఉమర్ రజి ఖలీఫస్సాని ఒకసారి ఉ బై బిన్ కఅబ్ రజితో తగాద పడ్డారు. ఖాజి వద్ద వ్యాజ్యము మోపబడింది. ఖాజి హ్రజత్ ఉమర్ రజిను పిలిపించారు. హ్రజత్ఉమర్ రజి ఖజాకు చేరుకున్న తరుణంలో ఖలీఫా అనే గౌరవంతో ఖాజి తన ఆస్థానం నుండి క్రిందికి వచ్చారు. హ్రజత్ ఉమర్ రజి తన ప్రత్యర్థితో కలసి కూర్చున్నారు. ఆ తరువాత ఖాజితో ఇలా అన్నారు. నీవు మొదట అన్యాయముగా వ్యవహరించావు. ఈ న్యాయస్థానంలో నా మధ్యలో నా ప్రత్యర్థి మధ్యలో ఎలాంటి తేడాలు చూపించకుండ ఉండాల్సినది అని హితబోధ చేశారు. (అహ్మదియ్యత్ యాఅని హఖీఖి ఇస్లాం, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 8, పుట 300)

హ్రజత్ ఉమర్ రజి ఇఫ్తా (ఫత్వాలను జారి చేయు) వ్యవస్థను కూడ ఏర్పాటు చేశారు. ధర్మశాస్త్రం పట్ల అవగాహన కల్పించడం కోసం ఇఫ్తా అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందుకోసం వారు రజి కొంత మంది అనుచరులను నియమించారు. వారు గాకుండా మరెవరు కూడ ఫత్వాలు జారి చేయకూడదని

ఆదేశాలు కూడ జారి చేశారు. వారిలో అనగా ఫత్వా జారి చేయువారిలో హజ్రత్ అలీ రజి, హజ్రత్ ఉస్మాన్ రజి, హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ రజి, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి, హజ్రత్ ఉబై బిన్ కఅబ్ రజి, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ రజి, హజ్రత్ అబూహురైరహ్ రజి, హజ్రత్ అబూదర్దా రజిలు గలరు. వీరు గాకుండా మరెవరైన ఫత్వాలు ఇవ్వడానికి ప్రయత్నించినచో హజ్రత్ ఉమర్ రజి వారిని వారించేవారు. హజ్రత్ ఉమర్ రజి ఈ ముఫ్తిలను కూడ అప్పుడప్పుడు పరీక్షించి చూసేవారు. (అల్ ఫారూఖ్, షబ్లి నుఅమాని, పుట 202, ఇదారహ్ ఇస్లామియాత్ కరాచి 2004)

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఈ అంశంను గూర్చి ఈ విధముగా తెల్పుచున్నారు: ఫత్వాకు చెందిన ఒక శాఖ గలదు. ఈ శాఖ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హుజూర్ (స) అనుచరుల తరువాత ఖలీఫాల కాలంలో ఏర్పాటు చేయడమైనది. ధర్మశాస్త్ర విషయంలో ప్రతి ఒక్కరికి ఫత్వాలు ఇచ్చే అధికారం లేదు. ఈ విషయంలో హజ్రత్ ఉమర్ రజియల్లాహ్ తాలా అన్హు చాలా జాగ్రతలు పాటించేవారు. ఒక అనుచరుడు బహుశా అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ రజికావచ్చును. వారు ధర్మశాస్త్ర పరిజ్ఞానంలో చాలా అవగాన కల్గినవారు. పైగా ఒక గొప్ప వ్యక్తిగా పేరు గడించినవారు, ఒకసారి ఒక సమస్యను ప్రజలకు విడమర్చి చెప్పారు. ఈ విషయంను గూర్చి హజ్రత్ ఉమర్ రజికు తెలిసింది. హజ్రత్ ఉమర్ రజికు ఆ విషయం తెలియగానే వెంటనే వారు నీవు అమీర్‌గా నియమించబడ్డావా?, లేకా నీకు నీవే అమీర్‌గా భావించు కుంటున్నావా?, ఫత్వాలు ఎందుకు ఇస్తున్నావు? అని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ రజి నుండి జవాబును వ్రాసి ఇవ్వమని కోరారు. వాస్తవమేమనగా ప్రతి ఒక్కరికి ఫత్వా ఇచ్చే అధికారాన్ని కట్టబెట్టినచో అనేక సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి భిన్నమైన ఫత్వాల వలన ప్రజలకు అపార నష్టం కల్గవచ్చును. ఎందుకనగా కొన్ని సందార్భలలో ఒకే విధమైన అంశానికి రెండు రకాల ఫత్వాలు జారి కావచ్చును. ఆ రెండు ఆయా పరిస్థితుల దృష్ట్యా సరైనవే కావచ్చును. అనగా పరిస్థితుల దృష్ట్యా మరియు వ్యక్తుల ఆలోచనల దృష్ట్యా అలా ఫత్వాలు ఇచ్చి ఉండవచ్చును. కాని కొన్ని సమస్యలను పరిశీలించి చూసినచో అందులో మనకు కొన్ని తిరకాసులు కనిపిస్తుంటాయి. అందుకే ఈ పరిస్థితులలో ఈ ఫత్వా చెల్లుబాటు అవుతుంది, ఆ పరిస్థితులలో ఆ ఫత్వా చెల్లుబాటు అవుతుంది అని చెప్పడం జరుగుతుంది. కాని సాధారణ ప్రజానికానికి ఈ రెండు ఫత్వాలు ఎలా సరైనవి అనబడుతాయి అనే విషయాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టతర మవుతుంది. దాని ద్వారా మరికొన్ని సమస్యలు ఉత్పనం కావచ్చును. (ఖితాబ్ జల్సా సాలాన 17 మార్చి, 1919, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 4, పుట 404).

అదే విధముగా పోలీస్ వ్యవస్థను స్థాపించారు. దేశంలో శాంతి సామరస్యతలు నెలకొల్పడం కోసం హజ్రత్ ఉమర్ రజి పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ పోలీస్ శాఖకు శాంతి, సామర్యతలను నెలకొల్పడంతో పాటు బాజార్‌ల పర్యవేక్షణల బాధ్యతలను కూడ అప్పగించారు. ప్రజలు సరైన విధముగా విధి విధానాలను అనుసరిస్తున్నారా? లేదా? అని పర్యవేక్షణలు జరపడం వారి బాధ్యత. ఎవరి హక్కులైన హరించి వేయబడుచున్నచో వారికి హక్కులు కల్పించడం. ఏదేని వ్యవస్థపరమైన ఆంశం ఉన్నచో అది ఖాజి పర్యవేక్షణకు చేరునంత వరకు ఆ వ్యవహారాన్ని అదుపు చేయుట, శాంతి బద్రతలను నెలకొల్పుట, పర్యవేక్షణలు జరుపుట వంటి అధికారాలు కల్పించబడ్డాయి. హజ్రత్ ఉమర్ రజి జైళ్ళను కూడ ఏర్పాటు చేశారు. అంతకు ముందు జైళ్ళ వ్యవస్థ ఉండేది కాదు. నెరస్థులకు కఠినమైన శిక్షలు విధించేవారు గాని ఒక ప్రత్యేక జైళ్ళ వ్యవస్థ ఉండేది కాదు.

అదే విధముగా హజ్రత్ ఉమర్ రజి బైతుల్ మాల్ వ్యవస్థను కూడ ఏర్పాటు చేశారు. హజ్రత్ ఉమర్ రజి కంటే పూర్వం సంపద ఎప్పుడు వచ్చిన కూడ వెంటనే పంపకాలు చేసేవారు. హజ్రత్ అబూబకర్ రజి ఖిలాఫత్ కాలంలో ఒక భవనాన్ని కొనుగోలు చేసి దానిని బైతుల్ మాల్ కోసం ప్రత్యేకించడం జరిగింది. కాని అది ఎప్పటికి మూసివేసి ఉండేది. ఎందుకనగా వచ్చిన సంపదను వచ్చినట్లుగానే పంచి పెట్టేవారు. హిజ్రి 15వ సంవత్సరలో బెహ్‌రైన్ నుండి 5 లక్షల రూపాయలు బైతుల్ మాల్‌కు రావడం జరిగింది. హజ్రత్ ఉమర్ రజి ఈ విషయంను గూర్చి అనుచరులతో చర్చించారు. వారిలో కొందరు సిరియా దేశ రాజదానిలో కోశగార శాఖ ఉన్నట్లు సలహాలు ఇచ్చారు. ఆ సలహా పట్ల హజ్రత్ ఉమర్ రజి హర్షంను వ్యక్త పరిచారు. అలా మదీనాలో బైతుల్ మాల్ వ్యవస్థను స్థాపించారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అర్ఖమ్ రజిను బైతుల్ మాల్ అధికారిగా నియమించారు. ఆ తరువాత కాలంలో మదీనాతో పాటు ఇతర అన్ని రాష్ట్రాలలో, వాటి ప్రముఖ రాజధానులలో బైతుల్ మాల్ వ్యవస్థను ప్రారంభించారు. హజ్రత్ ఉమర్ రజి భవన నిర్మాణ విషయంలో చాలా పొదుపును పాటించేవారు. కాని బైతుల్ మాల్ విషయానికి వచ్చినప్పుడు చాలా గొప్పగా, పటిష్టముగా వైభవమైన భవనాన్ని నిర్మింపజేశారు. ఆ తరువాత ఆ భవనానికి కాపల కాయడం కోసం కాపాల దారులను నియమించారు.

(అల్ ఫారూఖ్, షబ్లీ నుఅమాని, పుట 203–205, ఇదారతుల్ ఇస్లామియతు కరాచి 2004)

సెక్యూరిటి పరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. బైతుల్ మాల్ విషయంలో హజ్రత్ ఉమర్ రజి స్వయముగా పర్యవేక్షణలు జరిపేవారు. చరిత్రలో ఈ విధముగా పేర్కొనడం జరిగింది. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ రజి స్వతంత్ర బానిస ఇలా ఉల్లేఖించారు:. ఒకరోజు తీవ్రముగా ఎండలు కాస్తున్నాయి. మదీనా నుండి నజద్ వైపు నాలుగు నుండి ఎనమిది మైళ్ళ దూరంలో ఒక లోతట్టు ప్రాంతం గలదు. దానిని ఆలియా ప్రాంతం అని పిలుస్తుంటారు. హజ్రత్ ఉస్మాన్ రజితో పాటు నేను కూడ ఆ ఆలియా ప్రాంతంలో పశువులను మేపుతూ ఉన్నాను. ఆ సమయంలో ఒక వ్యక్తి రెండు నవయవ్వనపు ఒంటెలను కొట్టుకొని వస్తుండగా మేము చూశాము. అనగా ఒక వ్యక్తి రెండు ఒంటెలను కొట్టుకొని వస్తుండగా దూరం నుండి హజ్రత్ ఉస్మాన్ రజి చూశారు. ఒంటెలు ఆ వ్యక్తి ముందు వెగంగా నడుస్తూ వస్తున్నాయి. తీవ్రమైన ఎండవలన నేల కూడ చాలా కాలుతూ ఉన్నది. అందుకు హజ్రత్ ఉస్మాన్ రజి ఆ వ్యక్తి ఏమైనది. ఇతడు మదీనాలోనే ఉండి, వాతవరణం కొంచెం చల్లబడిన తరువాత బయలు దేరినచో ఏమైంది?. అతనికే బాగుండేది కదా? అని అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ, ఆ వ్యక్తి దగ్గరికి వస్తున్నప్పుడు ఇంతకు ఆ వ్యక్తి ఎవరో చూడము అని నాతో అన్నారు. అందుకు నేను అతడు ఒక దుప్పటిని కప్పుకొని, రెండు నవయవ్వనపు ఒంటెలను కొట్టుకుంటూ వస్తున్నారు అని సమాధానం ఇచ్చాను. మరి కొద్ది సమయం తరువాత ఆ వ్యక్తి మాకు ఇంకా కొంచం దగ్గరికి వచ్చాడు. అప్పుడు ఆ వ్యక్తి ఎవరో చూడమని మరల హజ్రత్ ఉస్మాన్ రజి నన్ను ఆదేశించగా, నేను ఆ వ్యక్తిని పరిశీలనగా చూశాను, అప్పుడు వారు హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజి అని గుర్తించాను. అందుకు నేను వెంటనే వారు అమీరుల్ మోమినీన్ రజి అని సమాధానం ఇచ్చాను. హజ్రత్ ఉస్మాన్ రజి నిలబడి, గుమ్మం నుండి బయటికి వచ్చారు. కాని వడగాలులు వేగంగా వీస్తున్నందున తమ తలను గుమ్మంలోపలే ఉంచారు. ఆపై వెంటనే హజ్రత్ ఉమర్ రజి వైపు చూస్తూ మీరు ఏ అత్యవసర పని వలన ఈ వేళలో ఇంట్లో నుండి బయటికి వచ్చారు?విన్నవించుకున్నారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి ధాన ధర్మాల కోసం ఇచ్చిన ఒంటెలలో రెండు ఒంటెలు వెనుక పడి పోయాయి. మిగిలిన ఒంటెలన్ని ముందుగానే కొట్టుకపోవడం జరిగింది. కావున నేను వాటిని వాటి కంచె వరకు తీసుకవెళ్ళి అక్కడ వదిలి పెట్టాలని భావించాను. ఒకవేళ ఇవి తప్పిపోయినచో దేవుడికి నేను సమాధానం చెప్పుకోవలసి వస్తుందని భయపడుతున్నాను అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ రజి ఓ అమీరుల్ మోమినీన్! మీరు నీడలోకి రండి, మంచినీళ్ళు త్రాగండి. ఈ పని కోసం మేము ఇద్దరం ఉన్నాము కదా!. ఆ పనిని మేము పూర్తి చేస్తాము. వాటిని అక్కడి చేర్చే ఏర్పాట్లు చేస్తాము అని విన్నవించుకున్నారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి మీరు ముందుగా, మీరు ఉన్నటు వంటి నీడలోకి వెళ్ళండి అని ఆదేశించారు. అందుకు హజ్రత్ ఉస్మాన్ రజి స్వతంత్ర బానిస మరల ఇలా తెలిపారు: నేను మరల వారితో ఇలా విన్నవించుకున్నాను. మీకు సరిపడునంత చోటు మా వద్ద ఉన్నది. అందుకు హజ్రత్ ఉమర్ రజి ముందు నీవు నీడలోకి వెళ్ళుము అని ఆదేశించి ఆ తరువాత వారు అక్కడి నుండి వెళ్ళిపోయారు. హజ్రత్ ఉస్మాన్ రజి ఇలా తెలిపారు: వారు రజి అల్ ఖవియ్యుల్ అమీన్ అనగా ఎవరైన పటిష్టమైన విశ్వాసం మరియు న్యాసవంతులైన వారిని చూడాలనుకున్నచో వారు హజ్రత్ ఉమర్ రజిను చూడండి.

మరొక కథనములో ఈ విధముగా గలదు: ఉమర్ బిన్ నాఫిఅ అబూబకర్ ఈసాతో ఈ విధముగా ఉల్లేఖించారు: వారు ఇలా తెలిపారు: హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజి, హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ రజి మరియు హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ రజిలతో కలసి సద్కాను సేకరించుటకు నేను కూడ వచ్చాను. హజ్రత్ ఉస్మాన్ రజి నీడలో కూర్చొని ఉన్నారు. హజ్రత్ అలీ రజి వారి వద్ద నిలబడి ఏదో విషయంను గూర్చి మాట్లాడుచున్నారు. హజ్రత్ ఉమర్ రజి మాత్రం తీవ్రమైన ఎండ ఉన్నప్పటికి ఎండలోనే నిలబడి ఉన్నారు. వారి వద్ద రెండు నల్లటి దుప్పట్లు ఉన్నాయి. ఒక దానితో వారు లుంగిని చుట్టుకోగా, మరొకదానిని వారు తలపై వేసుకున్నారు. ఆ సమయంలో వారు సద్కా కోసం సేకరించిన ఒంటెలను పరిశీలిస్తున్నారు. అనగా ఒంటెల రంగు మరియు వాటి వయస్సును గూర్చి నమోదు చేసుకుంటున్నారు. హజ్రత్ అలీ రజి, హజ్రత్ ఉస్మాన్ రజి తో ఇలా అన్నారు. దైవ గ్రంథములో మీరు హజ్రత్ షోహైబ్ కుమార్తె వ్యాఖ్యమును విన్నారా?.

ఇన్న ఖైర మనిస్తజరుతల్ ఖౌవియ్యుల్ అమీన్ (అల్ ఖసస్: 27) అనగా నిశ్చయముగా మీరు ఎవరిని ఉధ్యోగిగా నియమించిన వారిలో బలశాలి మరియు న్యాసవంతుడే ఉత్తముడు. మరల హ్రజత్అలీ రజి హ్రజత్ ఉమర్ రజి వైపు సైగ చేస్తూ ఆ ఖవియ్యుల్ అమీన్ అనగా ఆ బలశాలి మరియు న్యాసవంతులు వీరే అని అన్నారు. (ఉసదుల్ ఘాబా ఫి మఅరుఫతుస్సహాబ, సంపుటి 3, పుట 667, ఉమర్ బిన్ ఖత్తాబ్ , ప్రచురణ దారుల్ ఫికర్ బెహ్రూత్ లిబ్నాన్ 2003).

హ్రజత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఈ విషయమును గూర్చి ఈ విధముగా తెలిపారు: హ్రజత్ ఉమర్ రజియల్లాహ్ తాలా అన్‌హుకు చెందిన ఒక ఘటన. హ్రజత్ ఉస్మాన్ రజి ఇలా తెల్పుచున్నారు. ఒకసారి నేను ఖుబా బయట కూర్చొని ఉన్నాను. ఎంతటి వడగాలులు వీస్తున్నాయనగా, తలుపులు తీయడానికి కూడ నాకు ధైర్యం చాలడం లేదు. అంతలోనే నా సేవకుడు ఒకరు చూడండి ఇంత ఎండలో కూడ ఒక వ్యక్తి బయట తిరుగుతున్నాడు అని అన్నాడు. నేను పరదాను ప్రక్కకు జరిపి చూడగా నాకు ఆ వ్యక్తి కనిపించాడు. తీవ్ర ఎండవలన ఆ వ్యక్తి ముఖము నల్లబడిపోయింది. బహుశా ఎవరైన బాటసారి కావచ్చును అని నేను నా సేవకుడితో అన్నాను. కొద్ది సమయం తరువాత చూసినచో ఆ వ్యక్తి నా స్థావరం వద్దకు చేరుకున్నాడు. అతడిని పరిశీలించి చూడగా వారు హ్రజత్ ఉమర్ రజి. వారిని చూడగానే ఆందోళన చెందుతూ నేను బయటికి వచ్చాను. ఆపై ఈ సమయంలో, ఇంత ఎండలో మీరు ఇక్కడికి ఏ పని మీద వచ్చారు? అని అడిగి తెలుసుకున్నాను. అందుకు హ్రజత్ ఉమర్ రజి బైతుల్ మాల్‌కు చెందిన ఒక ఒంటె తప్పిపోయినది. దానిని వెదుకుతూ నేను బయటికి వచ్చాను అని అన్నారు.

(తఫ్సీరే కబీర్ సంపుటి 8, పుట 314-315)

ఒంటె తప్పిపోయిన కథనము కూడ ఒకటి ఉన్నది. ఆ కథనమును నేను గతంలో మీకు వినిపించాను.

హ్రజత్ ఉమర్ రజి ఒకసారి బైతుల్ మాల్‌కు చెందిన నగదును పంచి పెట్టుచున్నారు. ఆ క్రమంలోనే వారి కుమార్తే వచ్చి ఆ నగదులో నుండి ఒక దిర్హమును తీసుకున్నది. హ్రజత్ ఉమర్ రజి ఆ దిర్హమును తీసుకోవడం కోసం లేచి నిలబడ్డారు. ఆ క్రమంలో వారి ఒక భుజము నుండి దుప్పటి క్రిందికి జారిపోయింది. మరోవైపు వారి కుమార్తే ఏడుస్తూ ఇంటి వైపు పరుగెత్తినది. ఆ దిర్హమును ఆ బాలిక తన నోటిలో వేసుకున్నది. హ్రజత్ ఉమర్ రజి తన వ్రేళ్ళతో ఆ దిర్హమును బయటికి తీసారు. ఆ దిర్హమును తీసుకవచ్చి మరల ఆ నగదులో కలిపారు. ఆపై ఇలా ప్రసంగించారు: ఓ ప్రజలారా! ఉమర్ రజి మరియు ఉమర్ రజి బంధువులకు వారు దగ్గరి వారైనను, దూరము వారనైనను వారందరికి సాధారణ ముసల్మానులకు ఉన్నంత హక్కుయే ఉంటుంది. మరొక కథనములో ఈ విధముగా గలదు: హ్రజత్ అబూ మూసా రజి బైతుల్ మాల్ భవనంలో ఊడుస్తుండగా ఒక దిర్హము దొరికినది. హ్రజత్ ఉమర్ రజి గారి చిన్న పాప అక్కడి నుండి వెళ్ళుచుండగా ఆ దిర్హమును వారు ఆ పాపకు ఇచ్చారు. హ్రజత్ ఉమర్ రజి ఆ దిర్హమును ఆ పాప చేతిలో చూసి ఈ దిర్హము ఎక్కడిది అని అడిగి తెలుసుకున్నారు. అందుకు ఆ పాప దీనిని నాకు అబూ మూసా రజి ఇచ్చారు అని సమాధానం ఇవ్వగా, ఆ దిర్హము బైతుల్ మాల్‌కు చెందినదని తెలుసుకొని హ్రజత్ ఉమర్ రజి ఇలా అన్నారు. ఓ అబూ మూసా! మదీనాలో ఉన్న కుటుంబాలలో హ్రజత్ ఉమర్ రజి కుటుంబం కన్న పేద కుటుంబ నీకు మరెక్కడ కనిపించలేదా?, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజం ఈ విషయంను గూర్చి మమ్ములను ప్రశ్నించకుండా ఎవరు కూడ మిగిలి ఉండకూడదని భావిస్తున్నావా? అని ప్రశ్నించి, ఆ తరువాత ఆ దిర్హమును తిరిగి బైతుల్ మాల్‌లో జమా చేశారు. (ఇజాలతుల్ ఖఫా అన్ ఖులఫా ముతర్జం ఇష్తియాక్ అహ్మద్ గారు సంపుటి 3, పుట 286, ఖదీమి కుతుబ్ ఖాన ఆరామ్ బాఘ్ కరాచి).

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హ్రజత్ఉమర్ రజి ప్రజలకు మేలు కల్గించడం కోసం అనేక మహత్తరమైన కార్యక్రమాలను చేపట్టారు.

వ్యవసాయానికి అనుకూలంగా ఉండడానికి మరియు ప్రజలకు మంచి నీటి సౌకర్యాన్ని కల్పించుటకు కాలువలను త్రవ్వించారు. ఆ మహత్తర కార్యక్రమాలు ఈ విధముగా ఉన్నాయి: 1, దజ్లా అనే నదీ నుండి 9 మైళ్ళ దూరంలో ఉన్నటు వంటి బస్రా వరకు ఒక కాలువను త్రవ్వించి, దానికి "అబూమూసా కాలువ" అని నామకరణం చేశారు. 2, ముఅఖ్ఖల్ అనే మరో కాలువను కూడ దజ్లా నది నుండి త్రవ్వించడం జరిగింది. 3, హ్రజత్ ఉమర్ రజి ఆదేశాల మేరకు నైలు నదిని ఖుల్జుమ్ సముద్రంతో అనుసంధానం చేయడానికి కాలువను త్రవ్వించారు. ఆపై దానికి "అమీరుల్ మోమినీన్" అని నామకరణం చేశారు. హిజ్రి 18వ సంవత్సరంలో కరువు కాటకాలు ఏర్పడినప్పుడు హ్రజత్ ఉమర్ రజి హ్రజత్ అమర్ బిన ఆస్ రజిను సహాయం అందించమని లేఖ వ్రాసారు. దూరం ఎక్కువగా ఉన్నందున సహాయం అందడంలో ఆలస్యమైనది. కావున తరువాత కాలంలో హ్రజత్ ఉమర్ రజి హ్రజత్ అమర్ రజిను పిలిపించి నైలు నదిని సముద్రంతో అనుసంధానం చేసినచో అరబ్ దేశంలో ఎన్నడు కూడ కరువు కాటకాలు రావు అని సలహా ఇచ్చారు. అందుకు ఈజిప్ట్‌కు గవర్నర్‌గా ఉన్నటు వంటి హ్రజత్ అమర్ రజి తమ రాష్ట్రానకు తిరిగి వెళ్ళి ఫిస్తాత్ ప్రాంతం నుండి ఖుల్జూమ్ సముద్రం వరకు ఒక కాలువను త్రవ్వించారు. ఆ కాలువ ద్వారానే పెద్ద పెద్ద ఓడలు మదీనా ఓడరేవు అయినా జిద్దా వరకు చేరుకునేవి. ఈ కాలువ 29 మైళ్ళ పొడువు గలది. 6 నెలల సమయంలోనే త్రవ్వించడం జరిగింది. ఆ తరువాత హ్రజత్ అమర్ బిన్ ఆస్ రజి రోమ్ మరియు ఖుల్జూమ్ సముద్రాలను కలపడానికి మరొక కాలువను త్రవ్వించాలని నిర్ణయించుకున్నారు. ఆ క్రమంలోనే వారు ఈజిప్ట్ సమీపంలో సముద్రపు అంచున ఉన్న ఫర్మా అనే నగరం నుండి ఖుల్జూమ్ మరియు రోమ్ సముద్రాలను కలుపుటకు 70 మైళ్ళ దూరం వరకు కాలువను త్రవ్వించాలని నిర్ణయించుకున్నారు. కాని యూనానీయుల చేతులో హజ్ యాత్రికులు దోపిడికి గురి అవుతారనే కారణం చేత హ్రజత్ ఉమర్ రజి ఈ నిర్ణయం పట్ల అయిష్టతను వ్యక్తపరిచారు. ఒకవేళ హ్రజత్ అమర్ బిన్ ఆస్ రజికు అనుమతి లభించినచో సూయజ్ కాలువను త్రవ్వించిన ఘనత కూడ అరబ్‌లకు దక్కేది. ఎందుకనగా తరువాత కాలంలో ఆ మార్గం గుండానే సూయజ్ కాలువను త్రవ్వించడం జరిగింది.

వివిధ రకాల నిర్మాణాలు: హ్రజత్ ఉమర్ రజి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అనేక భవనాలను నిర్మించారు. వాటిలో మస్జిద్‌లు, న్యాయస్థానాలు, సైనిక శిభిరాలు, బారేక్స్‌లు, దేశ అభివృద్ధి నిర్వాహణ కోసం అనేక కార్యాలయాలను, రోడ్లను, వంతెనలను, అతిథి గృహాలను, రక్షక బట నిలయాలు, విశ్రాంతి భవనాలు వంటి మొదలైనవి నిర్మించారు. అదే విధముగా మదీనా నుండి మక్కా వరకు ప్రతి మజలీలో ఒక మంచి నీటి చెలిమ, విశ్రాంతి భవనములను ఏర్పాటు చేయించారు. రక్షణ పటాలములను ఏర్పాటు చేశారు. (అల్ ఫారూఖ్, షుబ్లి నుఅమాని, పుట 206-210, ఇదారతుల్ ఇస్లామియాత్ కరాచి 2004).

అనగా కాపల దారుల కొరకు చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలు బస చేయడానికి, విశ్రాంతి తీసుకోవడానికి హొటల్స్ మరియు లాడ్జ్‌ల తరహాలో ఏర్పాట్లు చేయించారు.

హ్రజత్ ఉమర్ రజి నూతన నగరాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గూర్చి కూడ కొన్ని కథనాలు గలవు. హ్రజత్ ఉమర్ రజి తమ ఖిలాఫత్ కాలంలో అనేక నూతన నగరాలను ఏర్పాటు చేశారు. వారు వాటిని ఏర్పాటు చేయు క్రమంలో రక్షణ, పాడి పంటలు, ఆర్ధిక ప్రయోజనాలను దృష్టియందుంచుకున్నారు. ఆయా నగరాలను ఏర్పాటు చేయు క్రమంలో హ్రజత్ ఉమర్ రజి యుద్ధ అవసరాలను, రాజకీయ పరిణామాలను,ఆవాస యోగ్యపు ప్రయోజనాలను దృష్టియందుంచుకున్నారనే విషయం అర్థం అవుతుంది. ఆయా నగరాలు యుద్ద కాలంలో, సాధారణ రోజులలో శాంతి, సామరస్యతల దృష్ట్యా ప్రయోజనకరంగా ఉండేవి. హ్రజత్ ఉమర్ రజి అరబ్ మరియు అరబ్‌యేతర సరిహద్దులు కలిసే ప్రాంతంలో నగరాలను నిర్మించుటకు ప్రయత్నించేవారు. తద్వారా శత్రువుల అకస్మిక దాడుల నుండి దేశాన్ని కాపాడుకోవచ్చునని భావించేవారు. ఆయా నగరాలను కూడ అరబ్ నగరాలను పోలినట్లుగానే ఏర్పాటు చేసేవారు. ఆయా నగరాలలో ఒకవైపు అరబ్ భూభాగం ఉండేది. అది కంచెలుగా ఉపయోగపడేది. మరోవైపు పచ్చని తోటలు, పంటలతో కూడిన అరబేతర భూభాగం ఉండేది. వాటి ద్వారా ఫలాలు మరియు ఇతరాత్ర పంటలు సమకూర్చబడేవి. అనగా రెండవ వైపు వ్యవసాయం చేయబడేది. నగరాల మధ్య నదులు కాలువలు ఉండకుండా జాగ్రతలు పాటించేవారు. హ్రజత్ ఉమర్ రజి బస్రా, కూఫా మరియు ఫస్తాత్ వంటి నగరాలను ఏర్పాటు చేశారు.

హ్రజత్ ఉమర్ రజి పటిష్టముగా, సరైన విధముగా ఆయా నగరాలకు పునాదులను వేశారు. జన ఆవాస యోగ్యముగా తీర్చిదిద్దారు. ఆయ నగరాల రోడ్లను, వీధులను విశాలముగా ఉండేటట్లు చూశారు.చాలా విశాలముగా, పటిష్టముగా అందముగా ఉండేవి. వాటి నిర్మాణాలను చూసినచో వారు నిర్మాణ రంగంలో చాలా అనుభవం గలవారని, ప్రావీణ్యత గలవారని, వారికి సాటి ఎవరు లేరనే విషయం అర్థమవుతుంది. ( సీరత్ అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్, సేలాబి, పుట 214, 217, 221, దారుల్ మాఅరుఫతు బెహ్రూత్ 2007).

అదే విధముగా సైన్యపు విభాగాన్ని ఏర్పాటు చేశారు. హ్రజత్ ఉమర్ రజి అంచలంచలతో కూడిన ఒక సైన్యపు విభాగాన్ని ఏర్పాటు చేశారు. స్థాయిల పరంగా సైన్యాన్ని విభజించేవారు, వారికి జీతాలను ఇచ్చేవారు. హ్రజత్ ఉమర్ రజి సైన్యాన్ని

రెండు భాగాలలో విభజించారు. మొదటి భాగానికి చెందిన వారు యుద్ధంలో పాల్గొనేవారు, రెండవ వర్గానికి చెందిన వారు అత్యవసర సమయంలో పాల్గొనేవారు. హజ్రత్ ఉమర్ రజి సైన్యాన్ని క్రమబద్ధీకరించుటలో ప్రత్యేక శ్రద్ధను కనబర్చేవారు. వారు రజి చాలా కఠినమైన నిబంధనలను జారిచేసి ఆచరింపజేసేవారు. విజయం సాధించిన దేశాలలో ఏ సైనికుడు కూడ వ్యవసాయం గాని, వ్యాపారం గాని చేయకూడదని ఆదేశించేవారు. అనగా జయించిన ప్రాంతాలలో ఎవరు కూడ వ్యవసాయం గాని, వ్యాపారం గాని చేయకూడదు. అందుకు కారణం వీరు సైనికులు కావున, వారిలో సైనిక లక్షణాలు, ఆలోచనలు నెమ్మది నెమ్మదిగా కనుమరుగు అయ్యే అవకాశాలు అధికముగా ఉంటాయి. కాని నేడు మనం ముస్లిం దేశాలలో చూసినచో సైనికులు వ్యాపారాలలో లీనమైపోయారు. ఇంకా చెప్పుకోబడుచున్న విషయమేమనగా, గతంలో సైనికులు నియామకంలోకి చేర్చుకోబడగానే సైన్యపు నైపుణ్యత పెంచుకొనుటకు ప్రత్యేక శ్రద్ధను కనబర్చేవారు. కాని నేడు మాత్రం డ్యూటీలో చేరగానే ఎక్కడ క్రొత్త క్రొత్త కాలనీలు ఏర్పడుచున్నాయి, ఎక్కడ డిఫెన్స్ కాలనీలు నిర్మిస్తున్నారు. నాకు ఎక్కడ ప్లాటు కేటాయిస్తారు అనే విషయాల వైపే ప్రత్యేక శ్రద్ధను కనబర్చుతున్నారని తెలుస్తుంది. ఈ కారణం చేతనే వారిలో సైనిక లక్షణాలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి.

అదే విధముగా చలి మరియు వేడి ప్రాంతలపై యుద్ధం చేస్తున్నప్పుడు కాలాన్ని దృష్టియందుంచుకునేవారు. సైనికుల ఆరోగ్యం చెడిపోకుండా ఉండడం కోసం, ఎల్లప్పుడు ఆరోగ్యముగా ఉండడం కోసం సైనికులందరికి ఈత నేర్పించాలని హజ్రత్ ఉమర్ రజి కఠినమైన ఆదేశాలు జారి చేసేవారు. బాణాలు వేయడం, చెప్పులు లేకుండా నేలపై నడిపించడం వంటివి నేర్పించేవారు. అదే విధముగా ప్రతి సైనికునికి 4 నెలలకు ఒకసారి తన కుటుంబంతో కలసి జీవించి రావడానికి సెలవులు ఇచ్చేవారు. ధైర్య సహసాలను ప్రదర్శించడం కోసం స్వారి జంతువుల కల్లెపులో కాళు పెట్టి ఎక్కకుండా పరుగెత్తుకుంటూ వచ్చి ఒక్కసారిగా పైకి ఎగిరి గుర్రాలపై స్వారి చేయడం వంటివి నేర్పించేవారు. ఎండ నుండి కాపాడుకోవడం కోసం పలుచటి దుస్తువులు వాడకూడదని ఆదేశాలు జారి చేశారు. స్నానపు గదులలో స్నానాలు చేయకూడదని, అలా చేసినచో సు:ఖానికి అలవాటు పడిపోతారని ఆదేశాలు జారి చేసేవారు. హజ్రత్ ఉమర్ రజి వసంత కాలంలో సైన్యాన్ని పచ్చటి ప్రాంతాల వైపు పంపించేవారు. సైనిక పటాలములను ఏర్పాటు చేసేటప్పుడు వాతవరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకునేవారు. సైనికులను పచ్చటి తోటల వైపు, పంట పొలాల వైపు పంపించేవారు, తద్వారా వారు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడం వలన వారి ఆరోగ్యములు కూడ మేరుగు పడుతుండేవి. సైనిక పటాలములను ఏర్పాటు చేయుట కొరకు స్వచ్ఛమైన గాలి కల్గిన ప్రాంతాలను ఎంచుకునే వారు. అన్ని జిల్లాల్లో సైనికపటాలములను ఏర్పాటు చేసేవారు. సైనిక కేంద్రాలుగా మదీనా, కూఫా, బస్రా, మోసల్, ఫుస్తాత్, దిమిష్కక్, హిమస్, ఉర్దాన్, ఫలస్తీన్ వంటి నగరాలలో ఎల్లప్పుడు సైనికులు సిద్ధముగా ఉండేవారు. ప్రతి 4 నెలల తరువాత సైనికులకు సెలవులు ఇచ్చేవారు. సైనిక కేంద్రాలలో ఏకకాలంలో 4 వేల గుర్రాలు ఉండేవి. వాటి కోసం ప్రత్యేక పర్యవేక్షణలు ఉండేవి. గుర్రాలపై జైషున్ ఫి సబీలిల్లాహ్ అనగా దైవ మార్గపు సైన్యము అని గుర్తులతో వ్రాయించేవారు. హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలంలో ఇస్లామీయ సైన్యం యుద్ధ సామాగ్రిలో నూతన ఆయుధాలను సమకూర్చుకున్నారు. వాటిలో కోటలను పగలగొట్టు ఫిరంగ్‌లు, ట్యాంకర్లు, దూరపు లక్ష్యాలను చేదించు ఆయుధ సామాగ్రి కూడ ఉండేవి. పెద్ద పెద్ద కోటలను పగల గొట్టి ఆనవాళ్ళు లేకుండా ఇసుక వలే చేయు ఆయుధాలను దబాబ అని పిలుస్తారు. ఆ యంత్రంలో మనుషులు కూర్చొని కోట గోడలకు కన్నాలు వేసి గోడలను నేల మట్టం చేసేవారు. (అల్ ఫారూఖ్, షబ్లీ నుఅమాని, పుట 216-218, ఇదారతుల్ ఇస్లామియాతు కరాచి 2004) (సీరతుస్సహాబ, సంపుటి 1, పుట 126, 127, మోయినొద్దీన్ నద్వీ దారుల్ ఇషాఅత్ కరాచి పాకిస్తాన్ 2004) (లిసానుల్ అరబ్, దబ్ అనే పదం).

ఇస్లామీయ ప్రభుత్వంలో ఇతర జాతులకు చెందిన వారు కూడ ఉన్నతమైన పదవులలో ఉండేవారు. ముసల్మానులే ఉన్నత పదవులలో కొనసాగకుండా ముస్లిమేతరులు, అన్య జాతుల వారు కూడ ఉన్నత పదవులలో కొనసాగేవారు.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఇలా పేర్కొన్నారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫాల కాలంలో వాస్తవానికి ఇంకా ముస్లిం దేశాలలో శాంతి బధ్రతలు పూర్తి స్థాయిలో ఏర్పడక ముందే ఇతర జాతుల వారికి హక్కులు కల్పించడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే అల్లామా షబ్లి ఈ విషయాన్ని ప్రస్తావించుతూ ఈ విధముగా వ్రాసారు: హజ్రత్ ఉమర్ రజి యుద్ధ సైన్యాన్ని విస్తృత పర్చినప్పుడు ఒక ప్రాంతం, ఒక జాతి వారని ప్రత్యేకముగా నిర్ణయించలేదు. స్వచ్ఛంధముగా పాల్గొను సైన్యంలో అనేక మంది మజూషి అనగా దేవున్ని విశ్వసించకుండా, మంటను, సూర్యుడిని పూజించేవారు కూడ ఉండేవారు. వారికి కూడ ముసల్మానుల వలే సమానమైన ప్రోత్సాహక బహుమతులు లభించేవి. సైన్యపు వ్యవస్థలో కూడ ఈ మజూషీలు ఉండేవారు.

అదే విధముగా మరల వ్రాసారు: యూనానీ మరియు రోమన్ దేశాలకు చెందిన వీరులు కూడ సైన్యంలో ఉండేవారు. ఈజిప్ట్‌తో చేసిన యుద్ధంలో సుమారు 500ల మంది పాల్గొన్నారు. కాని నేడు పాకిస్తాన్‌లో మాత్రం అహ్మదీయులను సైన్యంలో నుండి తొలిగించండి. ఎందుకనగా అవి చాలా అత్యున్నత మరియు దేశ బధ్రతకు చెందిన పదవులు అని మాట్లాడుతుంటారు. కాని చరిత్రను తిరిగేసి చూసినచో పాకిస్తాన్ కొరకు అందరి కంటే ఎక్కువ తాగ్యాలు అహ్మదీ అధికారులు చేశారు. మొత్తానికి ఇది వారి చేష్టలు. హజ్రత్ ఉమర్ రజి ను గూర్చిమరల ఇలా పేర్కొనడం జరిగింది. అమర్ బిన్ ఆస్ రజి ఫుస్తాత్ నగరాన్ని ఏర్పాటు చేసినప్పుడు మొహల్లే అనే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో యూదులు కూడ ఉండేవారు. అందుకే ఈజిప్ట్‌తో యుద్ధం జరిగినప్పుడు సుమారు 1000 మంది యూదులు ఇస్లామీయ సైన్యంలో పాల్గొన్నారు. అదే విధముగా చరిత్ర ద్వారా మనకు తెలియు మరొక విషయమేమనగా, ఇతర జాతులకు చెందిన ప్రతిభావంతులను కూడ సైనిక ఉన్నత అధికారులు నియమించేవారు. హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలంలో ఈరానీయులకు చెందిన ఒక ప్రతిభావంతుడిని సైన్యాధికారిగా నియమించడం జరిగింది. వారిలో కొంత మంది పేర్లను కూడ చరిత్రలో పొందుపర్చడం జరిగింది. కావున అల్లామా షబ్లి ఆ 6 గురు ఉన్నత అధికారుల పేర్లను ఈ విధముగా పొందు పర్చారు. సియా, ఖుస్రు, సొహర్‌యార్, ఫీర్ వయా, షహర్‌వియా, అఫ్రోవ్‌దీన్‌లు. ఈ అధికారులకు జీతాలు కూడ ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించబడేవి. వారి పేర్లు జీతాల లీస్ట్‌లో ఉండేవి. 4 గురు ఖలీఫాల తరువాత హజ్రత్ ముఆవియా గురించి చరిత్రలో ఈ విధముగా పేర్కొనడం జరిగింది. వారి కాలంలో ఒక క్రైస్తవుడు ఇబ్నే ఆసాల్ అనే పేరు గల వ్యక్తి ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగేవారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి తఫ్సీరే కబీర్‌లో అల్లామా షబ్లిని ఆధారము చేసుకొని ఈ విధముగా పేర్కొన్నారు: అదే విధముగా అల్ ఫారూఖ్‌లో కూడ ఈ విషయం పొందు పర్చబడింది. కాని అరబి పుస్తకాలలో వారి పేరును అఫ్రోజీన్ అని లిఖించడం జరిగింది. దాల్‌కు బదులుగా జాల్‌ను లిఖించారు. (తఫ్సీరే కబీర్ సంపుటి 6, పుట 534,) (తారీఖే తబ్రీ సంపుటి 2, పుట 504, హిజ్రి 17 సంII దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 1987). మొత్తానికి పేరులో ఒక అక్షరం వేరుగా ఉన్నది. జాల్ అని ఒక చోట, దాల్ అని మరొక చోట గలదు. ప్రజలు చర్చలు చేస్తుంటారు కావున వివరముగా తెల్పుచున్నాను.

అదే విధముగా మార్కెట్‌లో ధరలను అదుపు చేయడం లేదా విలువలను పూర్తి స్థాయిలో తగ్గించడం వంటి వాటిని హజ్రత్ ఉమర్ నివారించేవారు. హజ్రత్ ఉమర్ ఈ విషయంలో ఒక విధానాన్ని తీసుకవచ్చారు. ధరను తగ్గించు విషయమును గూర్చి తెల్పుచూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఇలా తెలిపారు: పరిదిని దాటి ధరలను తగ్గించుటను ఇస్లాం ధర్మము నివారిస్తుంది. ధరను తగ్గించి సంపాధించడను కూడ అక్రమార్జితమని పేర్కొన్నది. ఎందుకనగా సంపన్న వ్యాపారులు చిన్నవ్యాపారులను తక్కువ ధరకు సరుకులను విక్రయించునట్లు చూస్తారు. అలా జరిగినచో చిన్న వ్యాపారులు నష్టపోతుంటారు. హజ్రత్ ఉమర్ రజి కాలంలో ఇలాంటి ఒక ఘటన చోటు చేసుకుంది. వారు రజి మార్కెట్ యార్డులో పర్యటిస్తుండగా ఒక ఇతర ప్రాంతానికి చెందిన వ్యాపారుడు ఎండిన ద్రాక్షను చాలా తక్కువ ధరకు విక్రయిస్తుండగా చూశారు. ఆ ధరకు మదీనా వ్యాపారులు విక్రయించలేక పోతున్నారు. అందుకు వారు రజి అతనిని నీ సరుకు తీసుకొని ఇక్కడి నుండి వెళ్ళిపొమ్ము లేదా మదీనా వ్యాపారులు విక్రయిస్తున్న ధరకే విక్రయించుము అని హెచ్చరించారు. మదీనా వారు అధిక లాభానికి విక్రయించడం లేదు, వారు కేవలం సగటు ధరకే అనగా ఖర్చుల మేరకు విక్రయిస్తున్నారు. కావున అతనిని కూడ ఆ ధరకే విక్రయించమని హజ్రత్ ఉమర్ రజి ఆదేశించారు. తరువాత వారు రజి అలా ఆదేశించడానికి గల కారణమేమిటి? అని అడిగి తెలుసుకోగా, ఒకవేళ అలా తక్కువ ధరకు విక్రయించుటకు అతనికి అనుమతి నిచ్చినచో సగటు ధరను దృష్టిలో ఉంచుకొని వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు నష్టపోతారు అని సమాధానం ఇచ్చారు. హజ్రత్ ఉమర్ రజి గారి ఈ విధానంపై కొందరు అనుచరులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధిలో మార్కెట్ యార్డ్ ధరల నిర్ణయాలలో ఇలా ప్రమేయం కల్పించుకోకూడదని ఫిర్యాధు చేశారు. కాని వారి

ఆరోపణ సరియైనది కాదు. ఎందుకనగా మార్కెట్ యార్డ్‌లో కల్పించుకోవడం అనగా ఉత్పత్తి మరియు అవసరంలో కల్పించుకోకూడదు. అనగా సరఫరా మరియు డిమాండ్‌ల విధానంలో కల్పించుకోకూడదు. ఇలా చేసినచో నిశ్చయముగా నష్టం వాటిల్లితుంది. ప్రభుత్వాలు కూడ ఈ ఆంశంలో జోక్యం చేసుకోకూడదు. మార్కెట్ యార్డ్‌లే స్వయముగా సరఫరా మరియు అవసరాలను దృష్టియందుంచుకొని సమపాల్లలో సరుకును అందుబాటులోకి తేస్తుంది. లేనిచో ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరవు. వ్యాపారులు కూడ నష్టపోతారు. ఈ విషయంలో వారికి స్వతంత్రతను కల్పించాలి. (ఇస్లాం కా ఇఖ్తిసాది నిజాం, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 18, పుట 53) కాని ధరలను నియత్రించు విషయంలో కల్పించుకోవాలి.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా వివరముగా తెల్పుచున్నారు: నగర హక్కులలో ఒక హక్కు క్రయవిక్రయాలలో సంబంధాలు దెబ్బతినకూడదు. ఇస్లాం ఈ హక్కును కూడ దృష్టియందుంచుకోవడాన్ని మనం చూస్తుంటాము. అందుకే ఇస్లాం ధరలను పెంచుటను, అధిక రేట్లకు విక్రయించుటను అడ్డుకొంటుంది. అదే విధముగా ఇతరులకు నష్టాన్ని చేకూర్చుటకు, వారిని వ్యాపార పరంగా దెబ్బతీయుటకు ధరలను తగ్గించకూడదని కూడ సూచిస్తుంది. ఇతరుల కంటే తక్కువ ధరకు విక్రయించటను కూడ నివారించినది. ఒకసారి మదీనాలో ఒక వ్యక్తి ఎంత తక్కువ ధరకు ద్రాక్షను విక్రయిస్తున్నాడనగా, ఆ ధరకు ఇతర వ్యాపారులు విక్రయించలేక పోతున్నారు. హజ్రత్ ఉమర్ రజి అతని ముందు నుండి వెళ్ళుతు అతనిని హెచ్చరించారు. ఎందుకనగా అలా చేసినచో ఇతర వ్యాపారులకు నష్టం వాటిల్లుతుంది. మొత్తానికి ఇస్లాం ధరలను పెంచుటను నివారిస్తుంది. అదే విధముగా ధరలను తగ్గించుటను కూడ అడ్డుకుంటుంది. అటు వ్యాపారులు, ఇటు ప్రజలు ఎవరు నష్టపోకుండా చూడాలని ఆదేశిస్తుంది. (తఫ్సీరే కబీర్ సంపుటి 10, పుట 307).

ఇక విద్యా విధానంను చూసినచో హజ్రత్ ఉమర్ రజి విద్యను చాలా అధికముగా ప్రోత్సహించేవారు. అన్ని దేశాలలో మదర్సాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఖుర్‌ఆన్ మరియు హదీస్, ఫిఖ్‌హాలను బోధించేవారు. గొప్ప గొప్ప అనుచరులను, విద్యావంతులను ఇతరులకు విద్యను నేర్పించడం కోసం నియమించారు. విద్యను బోధించేవారి కోసం జీతాలను కూడ నిర్ణయించారు.

(అల్ ఫారూఖ్, షిబ్లీ నుఅమాని, పుట 233, ఇదారతుల్ ఇస్లామియాతు కరాచి 2004)

అదే విధముగా హిజ్రి క్యాలెండర్‌ను ఎప్పుడు ఆవిష్కరించారు?. ఈ విషయాన్ని గూర్చి కథనాలు ఈ విధముగా ఉన్నాయి. ఇది సహి బుఖారికి చెందిన కథనము. హజ్రత్ సుహైల్ బిన్ సఅద్ రజి ఇలా తెల్పినారు: అనుచరులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తుత్వం నుండి తేదీలను లెక్కించలేదు. అదే విధముగా హుజూర్ (స) మరణ సమయం నుండి కూడ లెక్కించలేదు. కేవలం హుజూర్ (స) మదీనాకు ప్రస్థానం చేసిన తరువాత రోజు నుండి తేదీలను లెక్కించడం ప్రారంభించారు. (సహి, బుఖారి, కితాబుల్ మనాకిబ్ అన్సార్, బాబ్ అత్తారీఖ్ మిన్ అయిన అర్ర ఖవ్వాతారీఖ్, హదీస్ సంఖ్య 3934) అనగా హిజ్రత్ సమయం నుండి అని అర్థం.

బుఖారి విశ్లేషణకు చెందిన అల్లామా ఇబ్నే హజర్ ఉస్కాలానిఇలా తెల్పినారు: ఇమాం సోహైల్ దృష్టిలో అనుచరులు అల్లాహ్ తాలా ఆదేశమైన **ల మస్‌జిదున్ ఉస్సస అలత్తఖ్వా మిన్ అవ్వలి యౌమిన్** ను ఆధారము చేసుకొని ప్రస్థానం చేసిన తరువాత నుండి తేదీలను లెక్కించడం ప్రారంభించారు. కావున అవ్వలిల్ యౌమిన్ అనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు అనుచరులు మదీనాకు చేరుకున్న సమయం నుండి అని అర్థం. దేవునికే తెలుసు.

హిజ్రి క్యాలెండర్ అవసరం ఎందుకు వచ్చింది? అనే విషయాన్ని చూసుకున్నచో మనకు కొన్ని కథనాలు లభిస్తాయి. హజ్రత్ అబూ మూసా రజి హజ్రత్ ఉమర్ రజి వైపు ఇలా వ్రాసారు: మీ వైపు నుండి మాకు లేఖలు వస్తున్నాయి. అందులో ఎలాంటి తేదీలు వ్రాయడం లేదు. అప్పుడు హజ్రత్ ఉమర్ రజి అనుచరులను సలహాలు సంప్రదింపుల కోసం సమావేశ పరిచారు. అల్లామా ఇబ్నే హజర్ ఉస్కలాని ఇలా తెలిపారు. బుఖారి కి చెందిన కితాబుల్ అదబ్‌లో హాకిం మైమూన్ బిన్ మెహరాన్‌ను ఆధారము చేసుకొని ఇలా తెలిపారు: హజ్రత్ ఉమర్ రజి సన్నిధిలో ఒక చెక్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. దానిపై షఅబాన్ అని వ్రాసి ఉన్నది. అందుకు వారు రజి ఏ షఅబాన్? అని ప్రశ్నించారు. గడిచిన షఅబాన్ మాసమా? లేదా ఇప్పుడు మనం కొనసాగుతున్న సంవత్సరపు షఅబాన్ మాసమా? లేకా వచ్చే సంవత్సరపు షఅబాన్ మాసమా? అని ప్రశ్నించారు. ఆపై ప్రజలందరికి అర్థమయ్యే విధముగా తేదీలను నిర్ణయించాలి అని సూచనలు చేశారు.

ఇబ్నే సిరీన్ ఇలా తెలిపారు: ఒక వ్యక్తి యమన్ నుండి వచ్చాడు. అతడు ఇలా అన్నాడు. యమన్‌లో నేను ఒక విషయాన్ని గమణించాను. దానిని వారు తేది అని అంటున్నారు. దానిని వారు ఫలాన సంవత్సరం, ఫలాన మాసం, అని వ్రాస్తున్నారు అని తెలిపారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి ఇది చాలా మంచి పద్ధతి. మీరు కూడ ఈ విధముగానే తేదీలను వ్రాయండి అని ఆదేశించారు.

హిజ్రి సంవత్సరాన్ని ఎవరు ప్రారంభించారు? హిజ్రి క్యాలేండర్‌ను ఎవరు ఆవిష్కరించారు? అనే విషయంలో విభిన్న కథనాలు గలవు. మొదటి విషయానికి వచ్చినచో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తేదిలను నిర్ణయించాలని ఆదేశించారు. రబీఉల్ అవ్వల్‌లో తేదీలను వ్రాసుకున్నారు. ఈ క్రమంలోనే హాకీం తన రచన అల్ ఖలీలు అనే గ్రంథంలో ఇబ్నే షుఆబ్ జుహ్‌రి ఈ కథనాన్ని పొందు పర్చారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు చేరుకున్నారు. ఆపై తేదీలను లిఖించుమని ఆదేశించారు. కావున రబీఉల్ అవ్వల్ నుండి ప్రారంభించడం జరిగింది. అల్లామా ఇబ్నె హజర్ ఇట్లనిరి. ఈ కథనము **మ'జల్** కోవకు చెందినది. **మ'జల్** అనగా ఆ కథనములో వరుసగా ఇద్దరు లేదా ఇద్దరి కంటే ఎక్కువ కథకుల వివరములు తెలియకపోవడం. మరో కథనములో ఇట్లు గలదు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వలసదారునిగా మదీనా చేరుకున్న రోజు నుండి తేదీలను వ్రాసుకోవడం ప్రారంభించారు. కాని ప్రఖ్యాత కథనము దీనికి విరుద్ధంగా వున్నది. అదేమనగా హిజ్రీ సంవత్సరపు తేదీలు హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ హయాంలో జారీ అయినాయి.

సుబుల్ హుదా వర్రషాద్ ఫీ సీరతి ఖైరిల్ ఇబాది రచయిత ముహమ్మద్ బిన్ యూసుఫ్ స్వాలిహ్ ఇట్లనిరి. ఇబ్నె సలాహ్ ఇట్లు తెలిపిరి. వారు అబూతాహిర్ మహ్‌మిష్ పుస్తకము అష్షరూత్‌లో ఇట్లు వ్రాసి వున్నట్లు చూశారు. అనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తేదీని వ్రాయాలని ఆదేశించారు. ఎందుకనగా వారు నజ్రాన్ క్రైస్తవులకు ఉత్తరము వ్రాయించినప్పుడు ఇందులో హిజ్రి ఐదవ సం॥ అని వ్రాయమని హజ్రత్ అలీ రజిను ఆదేశించారు. అనగా వలస తర్వాత ఐదవ సంవత్సరము. కావున దీని ప్రకారము మొదట తేదీని ప్రారంభించిన వారిగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిలిచారు. ఈ విషయములో హజ్రత్ ఉమర్ రజి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించారు. రెండవ కథనము ప్రకారము యెమెన్ నివాసులైన హజ్రత్ ***యాలా*** బిన్ ఉమయ్యహ్ తేదీని ప్రారంభించినట్లు గలదు. ఈ విషయాన్ని ఇమామ్ అహ్మద్ గారు ప్రస్తావించారు. కాని ఇందులో అమర్ మరియు ***యాలా*** మధ్య వున్న ఒకరి వివరములు అందుబాటులో లేవు. ప్రఖ్యాతి గాంచిన మూడవ కథనము ప్రకారము హిజ్రి క్యాలండరు హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ హయాంలో జారీ అయినది.

హిజ్రి క్యాలండరును వలస నుండి ఎందుకు ప్రారంభించారో దీని వివరములు ఇట్లు గలవు. సంవత్సరమును నిర్ణయించుటకు హజ్రత్ ఉమర్ రజి సలహా అడిగినప్పుడు పవిత్ర ప్రవక్త జన్మ దినము నుండి ప్రారంభించాలని ఒక అభిప్రాయము వచ్చెను. ఆ తరువాత హుజూర్ (స) ప్రవక్తగా ప్రకటించుకున్న సంవత్సరము నుండి మొదలు పెట్టాలని రెండవ సలహా వచ్చెను. ఆ తరువాత హుజూర్ (స) సల్లం మరణ సం॥ నుండి దానిని ప్రారంభించాలని మూడవ సలహా వచ్చెను. ఆ తరువాత హుజూర్ (స) చేసిన వలస సం॥ నుండి దానిని మొదలు పెట్టాలని నాలుగవ అభిప్రాయము వచ్చెను. కావున అన్నింటిని పరిశీలించి హుజూర్ (స) చేసిన ప్రస్థాన సం॥ నుండి ప్రారంభించడం సముచితంగా భావించబడెను. ఎందుకనగా వారి జననము, ప్రవక్తుత్వ సం॥ గురించి కొంత భేదాభిప్రాయముండెను. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మృతి వార్త వలన ముస్లిములు బాధ, దుఃఖానికి గురైనందున హుజూర్ (స) మరణ సం॥ నుండి ప్రారంభించుటను సముచితంగా భావించలేదు. కావున అనుచరులు వలస విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు.

అనుచరులు రబీవుల్ అవ్వల్ బదులు ముహర్రమ్ నుండి ఎందుకు సం॥ను ప్రారంభించారనగా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముహర్రమ్ మాసములోనే వలస పోవుటకు సంకల్పించిరి. జుల్ హజ్జహ్‌లో బైఅతె అఖ్బ సానియా సంభవించెను. ఆ బైఅతే వలసకు నాంది పలికినది. బైఅతె అఖ్బ సానియా జరిగిన తరువాత, వలసకు సంకల్పించిన తర్వాత ముహర్రమ్ మాసపు చంద్రుడే ఉదయించెను. కావున దానినే ఆరంభముగా పెట్టాలని భావించబడెను. అల్లామా ఇబ్నె హజర్ ఇట్లనిరి. ఇస్లామీయ క్యాలండర్ ముహర్రమ్ నుండి ప్రారంభమగుటకు నా దృష్టిలో ఇది అత్యంత గట్టి నిదర్శము. (ఫతహుల్ బారి లి ఇబ్నే హజర్ , సంపుటి 7, పుట 314-315, కితాబుల్ మనాకిబుల్ అన్సార్, బాబ్ అత్తారీఖు, హదీస్ 3934, దారు ర్రియాన్ లిత్తరాసు ఖాహిర 1986). (సుబూలుల్ హుదా వర్రషాద్, సంపుటి 12,

పుట 36-37, మబ్దఉత్తారీఖుల్ ఇస్లామి, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహిరూత్ 1993).

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు ఎప్పుడు చేరుకున్నారు? దీని గురించి వివిధ అభిప్రాయములు గలవు. వారు వివిధ ప్రాంతములలో బస చేస్తూ రబీవుల్ అవ్వల్ 14 నబ్వీ తేదీన అనగా 622 సం॥ సెప్టెంబర్ 20వ తేదీన మదీనాకు చేరుకున్నారు. కొందరు చరిత్రకారుల దృష్టిలో రబీవుల్ అవ్వల్ 14 కాగా, మరికొందరి దృష్టిలో వారు సిఫర్‌లో బయలు దేరి రబీవుల్ అవ్వల్ లో చేరుకున్నారు. రబీవుల్ అవ్వల్ ఒకటవ తేదీన హుజూర్ (స) మక్కా నుండి వలసను ప్రారంభించగా రబీవుల్ అవ్వల్ 12వ తేదీన మదీనాకు చేరుకున్నారు. (సీరతు ఖాతమున్నబియ్యీన్ సల్లల్లాహు అలైహి వసల్లం, పుట 243, హజ్రత్ సాహెబ్జాదా మిర్జా బషీర్ అహ్మద్ ఎం.ఏ రజి) (షరఅ జర్కాని అలల్ మవాహిబ్ లిద్దునియతు సంపుటి 2, పుట 102, బాబ్ హిజ్రత్ ముస్తఫా వ అస్‌హాబు హు, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహిరూత్ 1996).

హిజ్రి క్యాలండర్ ఏ సం॥ నుండి మొదలైనదనే విషయములో వివిధ అభిప్రాయములున్నవి. క్యాలండర్ ఎప్పుడు ప్రారంభమైనదో తెలుపుచు కొందరు ఇట్లందురు. హిజ్రి 16వ సం॥ మొదలైనది. హిజ్రి 17వ సం॥ అని మరికొందరంటారు. హిజ్రి 18వ సం॥ అని మరికొందరి దృష్టిలో హిజ్రి 21వ సం॥ అని కొందరు చెప్పుకుంటారు. (ఫతుల్ బారి లి ఇబ్నే హజర్, సంపుటి 7, పుట 315, కితాబు మనాకిబుల్ అన్సార్, బాబుత్తారీఖు, హదీస్ 3934, దారుర్రియాన్ లిత్తరాసి ఖాహిరహ్ 1986). (అల్ కామిల్ ఫి త్తారీఖు లి ఇబ్నే అసీర్, సంపుటి 1, పుట 13, దారుల్ కుతుబుల్ అరబి, బెహిరూత్ 2012)(అల్ ఫారూఖ్, షబ్లి నుఅమాని, పుట 248, ఇదారతుల్ ఇస్లామియాత్ కరాచి 2004).

ఏది ఏమైనప్పటికి హజ్రత్ ఉమర్ రజి కాలములో ఈ క్యాలండర్ జారీ అయినట్లు అధికులు ఏకాభిప్రాయానికి చేరుకున్నారు. తత

**ఇస్లామీయ కరెన్సి (నాణేలు):** అధిక చరిత్రకారుల దృష్టిలో అరబ్‌లో మొట్ట మొదటిసారి నాణేలను అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ ప్రారంభించెను. కాని మొట్ట మొదటి సారి ఇస్లామీయ నాణేలు హజ్రత్ ఉమర్ రజి కాలములో ప్రారంభించబడెనని పవిత్ర నగరము మదీనాకు చెందిన కొందరు చరిత్ర కారులు పొందుపర్చారు. వాటిపై అల్‌హందులిల్లాహ్ అని చెక్కబడెను. మరికొన్నిటిపై ముహమ్మద్ రసూలుల్లాహ్ అని, మరికొన్నిటిపై లాఇలాహ ఇల్లల్లాహ్ వహ్‌దహు అని చెక్కబడెవి. కాని సాసానీ ఈరానీ చక్రవర్తుల చిత్రాలపై ఎలాంటి అభ్యంతరం ఎవరు తెలుపలేదు. మరొక పరిశోధన ప్రకారము మొట్ట మొదటి సారి దమాష్కస్‌లో హిజ్రి 17వ సం॥లో హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలములో ఇస్లామీయ నాణేములు జారీ చేయబడెను. కాని వాటిపై కూడ బాజన్‌తీని చక్రవర్తి చిత్రము మరియు లాతీనీలో వారి భాష వ్రాయబడేది. మరొక కథనము ప్రకారము హజ్రత్ ఉస్మాన్ రజి ఖిలాఫత్ హయాంలో హిజ్రి 28వ సం॥లో మొట్ట మొదటి సారి మన నాణేలు అమల్లోకి వచ్చాయి. తాత్కాలికంగా సాసానీయుల ప్రాంతములోనే నాణేలు వినియోగించబడెను. వాటిపై సాసానీ చక్రవర్తుల చిత్రములు ముద్రించబడేవి. కాని వాటిపై కూఫీ లిపిలో బిస్మిల్లాహ్ అని వ్రాయబడెను. (అల్ ఫారూఖ్, షబ్లీ నుఅమాని, పుట 250, ఇదారతుల్ ఇస్లామియాతు కరాచి 2004) (జుస్తజూయే మదీనా పుట 310, అబ్దుల్ హమీద్ ఖారి, మరియు నేష్నల్ పబ్లికేషన్స్ పాకిస్తాన్).

హజ్రత్ ఉమర్ రజి ఏ ఏ విషయములను మొట్ట మొదటి సారి జారీ చేశారు? ఏవి ప్రథమముగా ప్రారంభించబడ్డాయి? అవ్వలియాతే ఫారూఖీ అని వేటిని అంటారు? అనే విషయానికి వచ్చినచో అల్లామా షిబ్లీ నూమానీ తన పుస్తకము "అల్ ఫారూఖ్"లో ఇట్లు వ్రాశారు: హజ్రత్ ఉమర్ రజి ప్రారంభించిన నూతన విషయములను చరిత్రకారులు ఒకచోట సమకూర్చినారు. వాటిని ప్రథమములు అని అంటారు. అవి ఇట్లు గలవు. అనగా వీటిని ప్రారంభించారు.

(1) బైతుల్ మాల్ అనగా కోశాగారము. (2) న్యాయస్థానములను నిర్మించి, న్యాయమూర్తులను నియమించారు. (3) మరల తేదిని, సంవత్సరమును ప్రారంభించారు. అది నేటికి కొనసాగుతుంది. (4) అమీరుల్ ముమినీన్ అనే బిరుదును హజ్రత్ ఉమర్ రజి వర్తమాన ఖలీఫా కొరకు ప్రాచుర్యంలోకి తీసుకవచ్చారు. (5) సైన్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. (6) స్వచ్ఛంధ సేవకులకు కూడ వేతనములు నిర్ణయించారు. (7) ఆర్థిక కార్యాలయమును ప్రారంభించారు. (8) కొలతను జారీ చేశారు. (9) జనాభా లెక్కలు చేయించారు. 10) కాలువలను తవ్వించారు. (11) జనావాస నగరములను నిర్మించారు. అనగా కూఫా, బస్రా, జీజహ్, ఫుస్తాత్, మౌసల్ మొ॥ 12 నగరములు. (12) తమ అధీనములో వున్న దేశములను రాష్ట్రములలో విభజించారు. (13) ఉషూర్ అనగా పదవ భాగమును పన్ను లేదా వాటాగా విధించారు. ఉషూర్ పన్నునుహజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్‌హు కనుగొన్నారు ఇది ఎలా ప్రారంభమైనదగా విదేశాలకు ముస్లిం వ్యాపారస్తులు వ్యాపారము నిమిత్తం వెళ్లినప్పుడు అక్కడి ఆచారము ప్రకారము వ్యాపార లావాదేవీలపై ముస్లింల నుండి 10 శాతం పన్ను తీసుకునేవారు. అబూమూసా అష్‌అరీ రజియల్లాహు తఆలా అన్‌హు ఈ సంఘటనను హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్‌హుకు తెలపగా, ఆయా దేశాల నుండి వచ్చే వ్యాపారుల నుండి కూడ అంత మొత్తములోనే అనగా 10వ శాతం పన్ను వసూలు చేయాలని హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్‌హు ఆదేశించారు. (14) నదుల ద్వారా పండిన పంటపై పన్ను విధించి వసూలు చేయువారిని నియమించారు. (15) యుద్ధ వ్యాపారస్థులకు కూడ దేశములోకి వచ్చి వ్యాపారము చేయుటకు అనుమతించారు. (16) కారాగారములను ఏర్పాటు చేశారు. (17) బంధాగారములను ఏర్పాటు చేశారు. (18) రాత్రివేళలో గస్తి నిర్వహిస్తూ, పౌరుల పరిస్థితులు తెలుసుకొని పరిష్కరించు పద్ధతిని కనుగొన్నారు. (19) రక్షకభటుల నిలయాలను స్థాపించారు. (20) వివిధ ప్రాంతములలో సైనిక స్థావరాలను ఏర్పాటు చేశారు. (21) అశ్వముల సంతానములో అసీల్, ముజన్నస్‌లో రకపు గుర్రాలను గుర్తించారు. ఇది అప్పటి వరకు అరబ్‌లో లేకుండెను. (22) లేఖకులను నియమించిరి. (23) పవిత్ర మక్కా నుండి పవిత్ర మదీనా వరకు బాటసారుల విశ్రాంతి కొరకు వసతి గృహములను నిర్మించారు. (24) అనాథ పిల్లల కొరకు రోజువారీ రేషన్ నియమించారు. (25) వివిధ పట్టణములలో అతిథి గృహములను నిర్మింపజేశారు. (26) అరబ్ ప్రజలు అవిశ్వాసులైనను వారు బానిసలుగా చేయబడరనే నిబంధన విధించారు. (27) ఆధాయ మార్గాలు లేని క్రైస్తవులు, యూదుల కొరకు రేషన్ నిర్ణయించారు. (28) లేఖకుల పరంపరను ప్రారంభించారు. (29) పాఠశాలలకు నిధులు, ఉపాధ్యాయులకు వేతనములు నిర్ణయించారు. (30) పవిత్ర ఖుర్‌ఆన్‌ను ఒక గ్రంథము రూపంలో జమ చేయుటకు పట్టుబట్టి హజ్రత్ అబూబకర్ రజిను ఒప్పించారు. తామేస్వయముగా కృషి చేసి ఈ పనిని పూర్తి చేశారు. (31) ఖియాస్ (ఏదేని ధార్మిక సమస్య గురించి ఆలోచించి నిర్ణయమును వెలువడించు) సూత్రమును ఏర్పాటు చేశారు. (32) హక్కులో ఔల్ విధానమును అమలు పరిచారు. అనగా అన్నపానియాలలో కొంతమందిని కొందరి కుటుంబ సభ్యులను చేసి వారికి భోజన ఖర్చులు చెల్లించు విధానం. (33) తరావీహ్ నమాజ్‌ను సామూహికంగా సలుపుటను మొదలు పెట్టారు. (34) ఏక కాలములో ఇవ్వబడే మూడు విడాకులను అంతిమ విడాకులుగా నిర్ణయించారు. దీనిని వారు శిక్షగా నిర్ణయించారు. (35) మద్యపానము సేవించిన వారికి 80 కోరడా దెబ్బలను శిక్షగా నిర్ణయించారు. (36) వ్యాపార గుర్రములపై జకాత్ విధించారు. (37) బనూసాలబ్‌లోని క్రైస్తవులపై పన్ను బదులు జకాత్ విధించారు. (38) అంకిత పద్ధతిని నెలకొల్పినారు. (39) జనాజ అనగా అంత్యక్రియ ప్రార్థనలో నాలుగు తక్బీర్‌ల గురించి అందరిని ఏకాభిప్రాయానికి తీసుక వచ్చారు. సాధారణంగా ఇదే ప్రవక్త పద్ధతి. మూడు తక్బీర్లు వుంటాయి. మొదటి తక్బీర్ నుండి చివరి తక్బీర్ అనగా సలాం తెలిపే కంటే ముందు వరకు నాలుగు తక్బీర్లు అగును....నేటికి ఈ పద్ధతే కొనసాగుతుంది. (40) మస్‌జిదులలో ఉపన్యాస పద్ధతిని మొదలు పెట్టారు. హజ్రత్ ఉమర్ రజి అనుమతితో తమీమ్ దారి ప్రసంగించారు. ఇది ఇస్లాంలో మొదటి ప్రసంగము. (41) ఇమాముల, ముఅజ్జిన వేతనములను నిర్ణయించారు. (42) మస్‌జిదులలో రాత్రి పూట వెలుతురుకు ఏర్పాట్లు చేశారు. (43) హుజూ చేసిన వారికి బహిష్కరణ శిక్షను అమలు పరిచారు. (44) ప్రేమపూర్వక పద్యములలో స్త్రీల పేర్లను చేర్చకూడదని ఆదేశించారు. వాస్తవానికి ఈ పద్ధతి అరబ్‌లో దశాబ్దాల నుండి కొనసాగుతుండెను. ఇవే గాక ఇంకా కొన్ని విషయములు ఉమర్ రజి ప్రథమములు వున్నాయి. కాని వాటిని మేము పుస్తక పుటలు పెరిగే భయముతో విడిచిపెట్టుతున్నామని అల్లామా షిబ్లీ నూమానీ పేర్కొన్నారు. (అల్ ఫారూఖ్, షబ్లీ నుఅమాని, పుట 401-403, 212, దారుల్ ఇషాఅత్ కరాచి 1991).

ఇంకా ఈ ప్రస్తావన కొనసాగుతుంది. తర్వాత ప్రస్తావించబడును. ఇన్‌షాఅల్లాహ్. ప్రస్తుతం నేను కొందరు మృతుల గురించి ప్రస్తావించదలచాను. నమాజ్ తర్వాత వారి జనాజ కూడ చదివించుతాను. ఇన్‌షాఅల్లాహ్.

మొదటి ప్రస్తావన గౌ॥ సరేపేతూ హాదీ సిసూవేయు ఇండోనేషియా గారిది. 79 సం॥ల వయస్సులో వీరు గత నెలలో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజిఊన్. వీరు 21 సం॥ వయస్సులో బైఅత్ చేశారు. అప్పుడు కూడ నేటి వలే చాలా స్థిరత్వమును ప్రదర్శించారు. మృతుని జ్ఞాపకార్థం భార్యతో పాటు ఎనిమిది మంది పిల్లలున్నారు. ఒక కుమారుడు ముబల్లిఘ్‌గా సేవలందిస్తున్నాడు. మృతులు

అనేకసార్లు జమాఅత్‌కు సదర్‌గా సేవలందించారు. దారుల్ ఖజా ఇండోనేషియాలో ఖాజీగా కూడ సేవలందించు అనుగ్రహము పొందారు. ప్రచారము పట్ల చాలా ఆసక్తి వుండేది. క్రియాశీలక ప్రచారకులుగా ఉండేవారు. ఎటువంటి భిన్న పరిస్థితులు ఎదురైనను ప్రచార ఉత్సాహము మాత్రం తగ్గలేదు. మురబ్బి అయిన వారి కుమారుడు అర్వాన్ హబీబుల్లాహ్ ఇలా తెల్పుచున్నారు: అనేకసార్లు మోటర్ సైకిల్ వాహనము ఎవరో ఒకరి ఇంటి వద్ద వదిలిపెట్టి నడుచుకుంటూ పాతిక మైళ్ల దూరము ప్రచారము కొరకు ప్రయాణము చేసేవారు. ఇతర గ్రామాలకు వెళ్లేందుకు నదులు, పర్వతములను దాటవలసి వచ్చినను దాటేవారు. ప్రయాణము చాలా కఠినముగా వుండేది. తండ్రి గారు చాలా శ్రమించేవారు, కష్టపడేవారు. తండ్రి గారు ఉపాధ్యాయునిగా ఉద్యోగము చేస్తున్నప్పుడు వారు ప్రిన్సిపాల్‌తో తాము బోధించు పాఠ్యాంశముల సమయంను నాలుగు రోజులకే సర్దండి అని విన్నవించుకున్నారు. అనగా వారి తరగతులన్నిటిని నాలుగు రోజులకే సవరించినచో మిగతా రోజులలో ప్రచారము కొరకు అధిక సమయము లభించవచ్చునని భావించేవారు. గురువారము పాఠశాల ముగిసిన తర్వాత నేరుగా ప్రచారము కొరకు వెళ్లి ఆదివారము సాయంత్రం ఇంటికి చేరుకునేవారు. కొన్ని సార్లు సోమవారము ఉదయం ఇంటికి చేరుకునేవారు.

బషారత్ అహ్మద్ మురబ్బి సిల్సిలహ్ ఇ. ఆ వ్రాసారు: మధ్యజావా లో వూనూసూబు ప్రాంతములో పది జమాఅత్‌లు వీరి ద్వారా ఏర్పడినవి. ఎట్టి పరిస్థితిలోనైనా తహజ్జుద్ కొరకు నిద్ర లేచేవారు. అన్ని వయస్సుల వారితో చాలా గౌరవముగా, మృదువుగా వ్యవహరించేవారు. ఒకసారి వారు ఇలా తెలిపారు: చివరి రోజు వరకు ప్రచారములో నిమగ్నమైవుండాలనేదే నా కోరిక. ఇందులోనే నా ఆనందము, నా ఆరోగ్య రహస్యమున్నది. అహ్మద్ హిదాయత్ మురబ్బి సిల్సిలహ్ గారు ఇలా తెలిపారు. మృతులు వీరులైన ప్రచారకర్త. వ్యతిరేకులు వారిని బెదిరించిన కూడ ఎన్నడు భయాందోళనకు గురి కాలేదు. ధైర్యముతో ఎదుర్కొనేవారు. అల్లాహ్ తఆలా క్షమాగుణముతో, కరుణతో వారి పట్ల వ్యవహరించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక!.

మరో ప్రస్తావన ఘోడూ జిల్లా నన్కానా ప్రాంతపు అల్లాహ్ దాద్ కుమారులైన చౌద్రీ బషీర్ అహ్మద్ గారిది. 95 సం॥ల వయసులో వీరు గత నెలలో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్. వీరి కుమారుడు ముహమ్మద్ అఫ్జల్ భట్టి గారు తన్జానియాలో మురబ్బి సిల్సిహ్‌గా సేవలందిస్తున్నారు. జన్మతః అహ్మదీయులు. నమాజులు, ఉపవాసములకు కట్టుబడి వుండేవారు. న్యాయాభిమాని, సత్యము పలికేవారు. అహ్మదియ్యత్, ఖిలాఫత్‌తో అమితాభిమానము కలిగి వుండేవారు. చిన్నప్పటి నుండే జల్సాకు ఖాదియాన్ వెళ్లేవారు. గ్రామములో తావీజ్ మంత్రాలు చేసేవారితో ప్రజలు చాలా భయపడేవారు. ఇది మన దేశములలో సర్వసాధారణమే. మీరు వీరికి భయపడకూడదు, అల్లాహ్ తఆలా ఇష్టమునకు వ్యతిరేకంగా వీరు మీకు ఎలాంటి నష్టము కలిగించలేరని ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించేవారు. అందుకు ప్రజలు అహ్మదీయులైన మీరు ఈ విషయములను నమ్మరు, కాని మాకు చాలా భయము వేస్తుంది అని సమాధానం ఇచ్చేవారు. 1953 సం॥లో అల్లర్లు మొదలైనప్పుడు అహ్మదియ్యత్ వ్యతిరేకులు ఆ ప్రాంతములో ర్యాలీ నిర్వహించారు. అహ్మదీయుల గృహములను దహనం చేసే ప్రణాళికను రచించారు. సమీప గ్రామాలకు చెందిన వారి బంధువులు, నాయకులు, గ్రామములో పలుకుబడి వున్న కొందరు అహ్మదీయేతరులు వారి వద్దకు వచ్చి " ఊరు బయట వున్నటువంటి మీ బంధువులైన అహ్మదీయులకు నచ్చచెప్పి వారిని అక్కడి నుండి వెళ్లిపొమ్మని చెప్పండి లేదా వారు అహ్మదియ్యత్‌ను నిరాకరించినట్లుగా చెప్పమనండి. ఎందుకనగా రేపు అక్కడి అహ్మదీయుల గృహాలను దహనము చేయాలనే ప్రణాళికను మేము రచించుకున్నాము. కావున పరిణామాలు తీవ్రంగా వుండును" అని హెచ్చరించారు . అనగా తాత్కాలికంగా అహ్మదియ్యత్‌ను తిరస్కరించి తర్వాత మరల తమ మతమును అనుసరించుకొమ్మని వారి బంధువులు వారికి నచ్చచెప్పినారు. అందుకు చౌద్రీ బషీర్ అహ్మద్ గారు "మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మేము చాలా విచారించిన తర్వాతనే అహ్మదియ్యత్‌ను స్వీకరించాము. మాకు ఎలాంటి నష్టము వాటిల్లదు. మీరు ఏమి చేయలేకపోతే చేయకండి. మాకు అల్లాహ్ తఆలాపై సంపూర్ణ నమ్మకమున్నది" అని సమాధానం ఇచ్చారు. కాని అల్లాహ్ తఆలా తర్వాత ఎంత గొప్ప మహిమను చూపెననగా ర్యాలీ కొంత దూరము వరకే వెళ్ళి చెల్లాచెదురై పోయినది. వారి స్థావరము వరకు చేరుకునే ధైర్యము వారికి కలుగనే కలుగ లేదు.

వీరి జ్ఞాపకార్థం ఇద్దరు కుమార్తెలు ఐదుగురు కుమారులున్నారు. ఒక కుమారులు గౌ॥ అఫ్జల్ భట్టి గారు మురబ్బి సిలిస్సలహ్‌గా తన్జానియాలో సేవలందిస్తున్నారు. సుధూర ప్రాంతాలలో సేవలందిస్తున్నందున సమయానికి జనాజ మరియు సమాధి కార్యక్రమాలలో పాల్గొనలేక పోయారు. అల్లాహ్ తఆలా మృతుని స్థాయి అంతస్థులను పెంచుగాక! వారి సంతానము కూడ వారి పుణ్యములను కొనసాగించు గాక! పాల్గొనలేక పోయిన వారి కుమారునికి కూడ సహనము, ధైర్యము ప్రసాదించుగాక!.

మరో ప్రస్తావన హమీదుల్లాహ్ ఖాదిమ్ మల్హీ గారిది. వీరు చౌద్రీ అల్లాహ్ రఖా మల్హీ దారున్నస్ర్ ఘర్బీ రబ్వా కుమారులు. 82 సం॥ల వయసులో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్. వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులైన చౌద్రీ అల్లాహ్ బఖ్ష్ గారి మనుమలు. అమరులు నస్రుల్లాహ్ మల్హీ మురబ్బి సిల్సిలహ్ గారి తండ్రి. మృతులు ప్రార్థనలు, ఉపవాసములకు కట్టుబడి వుండేవారు. సాదారణ స్వభావికులు, ధర్మమూర్తులు, పేదల పెన్నిధి, వినమ్రులు, అభిమానులైన అహ్మదీయులు. ఉద్యోగము చేస్తున్న రోజులలో కూడ ఎంతో ధైర్యముతో వ్యతిరేకతను ఎదురించారు. వీరి ఒక కుమారుడు జీవిత సమర్పితులుగా తాహిర్ హార్ట్ ఆసుపత్రి రబ్వాలో సేవలందిస్తున్నారు. అల్లాహ్ తఆలా వీరితో కూడ క్షమాగుణము, కరుణతో వ్యవహరించుగాక!

మరో ప్రస్తావన ముహమ్మద్ అలీ ఖాన్ పిశావర్ గారిది. వీరు షరీఫుల్లాహ్ ఖాన్ గారి కుమారులు. 89 సం॥ల వయసులో సహజ మరణము పొందారు. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ తఆలా కృపానుసారము 1/8 వసియ్యత్ చేశారు. వీరి జ్ఞాపకార్థం ముగ్గురు కుమార్తెలు, ఏడుగురు కుమారులు ఉన్నారు. వీరి కుమార్తె సలీమా గారు ఇక్కడ ఇస్లామాబాద్‌లో నివాసముంటున్న బుర్‌హాన్ అహ్మద్ గారి సతీమణి. సలీమా గారు ఇలా వ్రాసారు: "ఇంతకు ముందు వీరు ఘైర్ ముబాఇ (అనగా రెండవ ఖలీఫా గారి బైఅత్ చేయకుండా విడిపోయిన వారి)గా ఉండేవారు. అనంతరం 1954 సం॥లో రెండవ ఖలీఫా గారి హస్తమున బైఅత్ చేసి జీవితాంతం ఖిలాఫత్‌తో ముడి పడి ఉన్నారు." తరువాత కాలంలో వీరి తండ్రిగారు ధార్మిక పౌరుషం, జమాఅత్‌తో గట్టి సంబంధమును ప్రదర్శించారు. "అనంతరం వీరికి జమాఅత్ సేవలందించు అనుగ్రహము లభించినది. ఖాయిద్ జిల్లా ఖుద్దాముల్ అహ్మదియ్యహ్‌గా ఉన్నారు. అనంతరం వసాయా కార్యదర్శి, తాలీముల్ ఖుర్‌ఆన్ కార్యదర్శి మొ॥ పదవులను అలంకరించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చాలా శ్రద్ధతో పఠించేవారు. పవిత్ర ఖుర్‌ఆన్‌తో వారికి ఎనలేని ప్రేమ వుండేది. ఎల్లప్పుడు వారిని పవిత్ర ఖుర్‌ఆన్ పఠిస్తుండగా చూశాము. పవిత్ర ఖుర్‌ఆన్‌లోని చాలా భాగము వారికి నోటికి గుర్తుండేది. దుఆలు చేసేవారు, అతిథి మర్యాదలు చేసేవారు, సత్యము పలికేవారు, నిక్కచ్చి మనిషిగా వుండేవారు. దురూద్ షరీఫ్ బాగా చదివేవారు. ప్రజలకు ఆర్థిక సహాయం అందించేవారు. వీరి ఒక అహ్మదియేతర బంధువు వీరితో "ఒకవేళ మీరు అహ్మదియ్యత్‌ను వీడినచో మేము మీ పాదాలకు అంకితమైపోతాము" అని అన్నాడు. అందుకు మా తండ్రి గారు " నాకోసం మీరు త్యాగము చేయవలసిన అవసరము ఏమున్నది?. నేను స్వయంగా త్యాగమైపోయాను. ఇకనైన మీరు నా మాట వినండి. మసీహ్ మౌవూద్‌ను విశ్వసించండి. అవతరించవలసిన మసీహ్ అవతరించాడు. వారిని విశ్వసించి మీరు మీ జీవితములను చక్కదిద్దుకోండి " అని నచ్చజెప్పారు. కాని వారు ఇందుకు ఎలాంటి శ్రద్ధ చూపలేదు. క్రమ క్రమంగా ఆ బంధవులందరు దూరమైపోయారు. కాని వీరికి అహ్మదియ్యత్‌తో ఉన్న సంబంధము రోజు రోజుకు బలపడుతూ పోసాగింది. అల్లాహ్ తఆలా మృతుని పట్ల క్షమాగునముతో, కరుణతో వ్యవహరించుగాక! స్థాయి అంతస్థులను పెంచుగాక!.




**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

మరో ప్రస్తావన రాకుమారులు మహ్దీ లతీఫ్ మెరిల్యాండ్ అమెరికా గారిది. వీరు 87 సం॥ల వయసులో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్. రాకుమారులు మహ్దీ లతీఫ్ గారు హజ్రత్ రాకుమారులు అబ్దుల్లతీఫ్ అమరులు రజియల్లాహు తఆలా అన్హు గారి మనమలు (పోతా) రాకుమారులు ముహమ్మద్ తయ్యబ్ లతీఫ్ కీ॥ శే॥ గారి కుమారులు. అల్లాహ్ తఆలా కృపానుసారము రాకుమారులు మహ్దీ లతీఫ్ గారు వసియ్యత్ చేశారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చాలా ఏకాగ్రతతో పఠించేవారు. ఐదు పూటల నమాజులు, తహజ్జుద్ తప్పకుండా సలుపేవారు. అహ్మదియ్యా ఖిలాఫత్‌కు వీరాభిమానిగా ఉన్నారు. చాలా నిరాడంబర స్వభావికులు. ప్రచారము పట్ల వారికి అమితాసక్తి వుండేది. ప్రచారము చేయాలని ఇతరులకు కూడ ఎల్లప్పుడు సూచించేవారు. అల్లాహ్ తఆలా వారి పట్ల క్షమాగుణముతో, కరుణతో వ్యవహరించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక!.

మరో ప్రస్తావన ఫైజాన్ అహ్మద్ సమీర్ ఇబ్న్ షహ్‌జాద్ అక్బర్ గారిది. షహ్‌జాద్ అక్బర్ గారు మన ప్రైవేట్ సెక్రెటరీ రబ్వా కార్యాలయములో ఉద్యోగం చేస్తున్నారు. ఫైజాన్ అహ్మద్ వారి కుమారుడు. కోవిడ్ వలన 16 సం॥ల వయసులో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్. చాలా మేధావి, తక్కువ మాట్లాడేవారు, ధర్మమూర్తులైన బాలునిగా ఉండేవారు. వఖ్ఫె నౌ పథకములో చేరినారు. తన చదువు పట్ల శ్రద్ధ చూపేవారు, అనవసర విషయాలలోనే గాక, ఆటలలో కూడ చాలా తక్కువగా పాల్గొనేవారు. మంచి గంభీర స్వభావము కలిగిన బాలుడు. పాఠశాల తర్వాత అధిక సమయము ఇంట్లోనే గడిపేవాడు. మృతుని తల్లిదండ్రులకు అల్లాహ్ తఆలా సహనము ప్రసాదించుగాక! వీరి తాత (నానా) ఖ్వాజా అబ్దుష్షకూర్ గారు కూడ సుదీర్ఘ కాలము వరకు జమాఅత్‌కు సేవలందిస్తున్నారు. అల్లాహ్ తఆలా వారిపట్ల క్షమాగుణముతో, కరుణతో వ్యవహరించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక!.

---ఖుత్బా సానియా---

---

ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరియు ఇతర ధర్మాలకు చెందిన కొందరు వ్యక్తులు ఒక భవనముపై నిద్రించుచున్నారు. అనుకోకుండా వారి (అ)కు ఒక్కసారిగా మేలుకువ వచ్చినది. భవనము కూలిపోవునని వారు భావించారు. బాహ్యముగా భవనము కూలిపోవుటకు ఎలాంటి ఆధారాలు కనిపించడం లేవు. భవనము పైకప్పు నుండి కేవలం కర్రను కోయునట్లుగా శబ్దం మాత్రమే వస్తున్నది. వెంటనే వారు (అ) తమ తోటి వారందరిని మేల్కొలిపి భవనం కూలిపోవుటకు సిద్ధముగా ఉన్నది, కావున త్వరగా ఈ భవనమును ఖాళీ చేయవలెనని సూచించారు. కాని వారు మాత్రం ఇది కేవలం భ్రమ అని, ఎలాంటి భయాందోళన చెందవలసిన అవసరం లేదని, మరల నిద్రకు ఉపక్రమించారు. కొద్ది సమయం తరువాత మరల వారిని వారు (అ) మేల్కొలిపారు. వెంటనే భవనము ఖాళీ చేయవలెనని ఆదేశించారు. అందుకు వారందరు మీరు కేవలం మీ భ్రమ వలన ఇతరులను అనవసరముగా ఇబ్బందులకు గురి చేయుచున్నారని తమ అభిప్రాయమును వెల్లడించారు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మాత్రం తమ వలనే ఇంకా ఆ భవనము కూలిపోకుండా ఉన్నదని అర్థం చేసుకున్నారు. అందుకే ఒకవేళ ముందుగా నేను వెళ్ళినచో ఈ భవనము వెంటనే కూలిపోవును అని తలచి వెంటనే వారు అందరిని ముందుగా బయటికి పంపించి, చివరిగా వారు(అ) బయటికి వచ్చారు. ఈ క్రమములో వారు కేవలం ఒక అడుగు మాత్రమే మెట్లపై పెట్టి, మరో అడుగు తీసి రెండవ మెట్టుపై పెట్టుటకు కాలును భవనపు పై కప్పు నుండి ఎత్తినారు, వెంటనే భయంకరమైన శబ్దం చేస్తు ఒక్కసారిగా భవనపు పై కప్పు కూలిపోయినది. అక్కడ ఉన్నవారందరు ఆశ్చర్యముతో దిక్కులు చూడసాగారు. అంతేగాకా తమను ప్రాణాలతో కాపాడినందుకు వారి(అ) కి కృతజ్ఞతలు కూడ తెల్పినారు. పైగా వారి(అ) వలనే తమ ప్రాణాలు నిలిచినాయని అర్థం చేసుకున్నారు.

19 అక్టోబర్ 2013, శనివారము.

.............

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారం మేము విశ్వసించునదేమనగా, ఏ విధముగానైతే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ఖిలాఫతే రాషిదా కొనసాగిందో, అదే పరంపర హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలంలో కూడ కొనసాగుతుంది.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మృతి చెందిన తరువాత ప్రజలు హజ్రత్ మౌలానా హకీం నూరొద్దీన్ రజి గారిని మసీహ్ గారి ప్రథమ ఖలీఫాగా ఎన్నుకున్నారు. వారు రజి మృతి చెందిన తరువాత 1914లో ద్వితీయ ఖలీఫాను ఎన్నుకోవడం జరిగింది. హజ్రత్ మిర్జా బషీరొద్దీన్ మహ్మూద్ అహ్మద్ రజి మసీహ్ గారి రెండవ ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు.

హుజూర్ మరల ఇలా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మృతి చెందిన సమయానికి జమాఅత్ సభ్యుల సంఖ్య సుమారు 5లక్షల వరకు చేరుకున్నది. నేడు అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ప్రపంచపు 204 దేశాలలో ఈ సంఖ్య కోట్లలో ఉన్నది. నేడు ఖలీఫాను ఎన్నుకోవడం కోసం ఒక ఎన్నికల కమిటి కూడ ఉన్నది. ఆ కమిటిలో జమాఅత్ సంస్థలకు చెందిన, తహ్‌రీకే జదీద్ వంటి శాఖల పదవి దారులు, మరల సీనియర్ ముబల్లిఘ్‌లు, వివిధ దేశాలకు చెందిన అమీర్‌లు, మరి కొందరు ఇతర సభ్యులు కూడ సభ్యులుగా ఉన్నారు. వీరందరు ఒక చోట ఏకమై ఖలీఫాను ఎన్నుకుంటారు.

1982లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ మసీహ్ గారి మూడవ ఖలీఫా గారు మృతి చెందినప్పుడు మసీహ్ గారి నాలుగవ ఖలీఫా ఎన్నిక రబ్వాలో జరిగింది.

1984లో జనరల్ జియాహుల్ హఖ్ దౌర్జన్యపూరితమైన ఆర్డినెన్స్ అమలు చేయడం వలన చాలా కఠినమైన చట్టాలను రూపొందించారు. ఆపై ఇస్లామీయ సిద్ధాంతాల ప్రస్తావనపై నిబంధనలు విధించారు. ప్రస్తావించువారికి శిక్షలు నిర్ణయించారు. అస్సలాము అలైకుం అని పలికినా కూడ జైలు శిక్షలు విధించేవారు. పైగా జరిమాన విధించేవారు. అలాంటి పరిస్థితులలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబెహ్ అనగా మసీహ్ గారి నాలుగవ ఖలీఫా పాకిస్తాన్ నుండి లండన్‌కు వలస వెళ్ళిపోయారు. ఎందుకనగా వారు ఒక ఖలీఫాగా అక్కడ తమ బాధ్యతలను నిర్వర్తించలేక పోసాగారు. జమాఅత్‌కు కూడ మార్గదర్శకాలు చేయలేక పోవుచున్నారు.

2003లో లండన్‌లో వారు మృతి చెందినారు. కావున మస్జిద్ ఫజల్ లండన్‌లో 5వ ఖలీఫాను ఎన్నుకోవడం జరిగింది. "మస్జిద్ ఫజల్ " లండన్ లోనే అతి పురాతనమైన మస్జిద్. ఆ ఎన్నికల క్రమంలోనే 22 ఏప్రిల్ 2003న ఎన్నిక నిర్వహించగా నన్ను ఖలీఫాగా ఎన్నుకున్నారు అని హుజూర్ గారు తెలిపారు.

జర్నలిస్టును మరల ఈ విధముగా ప్రశ్నించాడు: హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు ప్రవక్తగా ప్రకటించారా? అనే సందేహం చాలా మందిలో ఉన్నది.

అందుకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధముగా సమాధానం ఇచ్చారు: ఈ భవిష్యవాణి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలం నుండే ఉన్నది. హుజూర్ (స) స్వయముగా ఈ విధముగా తెలిపారు: నా సమాజంలో అవతరించునట్టి మసీహ్ దేవుని ప్రవక్తగా అవతరించును.

హజ్రత్ ఏసుక్రీస్తుయే అవతరించబోవునట్టి మసీహ్ అని, ప్రస్తుతం వారు ఆకాశంపై ప్రాణాలతో ఉన్నారని, త్వరలోనే అవతరిస్తారని, మసీహ్ మరియు మహ్దీలు ఒక్కరు కాదని, ఇద్దరని సాధారణ ముసల్మానులు నమ్ముతుంటారు. అంతేగాకా మసీహ్ ఆకాశం నుండి వచ్చినచో మహ్దీ మాత్రం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజంలో నుండే అవతరిస్తారని, వీరు ఇరువురు కలసి పని చేస్తారని, ఖడ్గంతో యుద్ధాలు చేస్తారని, సిలువలను ముక్కలు ముక్కలు

| పవిత్ర ఖుర్ఆన్ బోధనలు | ఓ జనులారా! మీ ప్రభువు నుండి మీ వద్దకు సత్యముతో ప్రవక్త వచ్చియున్నాడు. కనుక విశ్వసింపుడు. ఇది మీకు మంచిది.అయినను మీరు నిరాకరించినచో భూమ్యా కాశముల యందున్న దంతయు నిశ్చయముగా అల్లాహ్‌దే. (నిసా: 171). |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

| పవిత్ర ఖుర్ఆన్ బోధనలు | ముందు విశ్వసించి, తరువాత విశ్వాసరహితులై, తిరిగి విశ్వసించి, మరల విశ్వాస రహితులై, విశ్వాసరాహిత్యమును పెంపొం దించుకొను వారిని నిశ్చయముగా అల్లాహ్ ఎన్నడును క్షమించడు. వారికి సరియైన మార్గమును చూపడు. (నిసా: 138) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

చేస్తారని, పందులను సంహారిస్తారని కూడ నమ్ముతుంటారు.

హజ్రత్ ఏసుక్రీస్తు అలైహిస్సలాం ఆకాశం నుండి గత ప్రవక్తగానే అవతరిస్తారని, వారి అవతరణ వలన ప్రవక్తుత్వ ముద్రకు ఎలాంటి భంగం కల్గదని ముస్లిం సమాజీకులు విశ్వసిస్తుంటారు. కాని దేవుడు మాత్రం వారిని ఇస్రాయీల సంతతి కోసం ప్రవక్తగా అవతరింప జేశాడు. కావున మరల వారు అవతరించినప్పుడు కూడ ప్రవక్త అనే బిరుదుతోనే అవతరిస్తారు. ఒకసారి ప్రవక్త అనే బిరుదును ప్రదానం చేసిన తరువాత దానిని తిరిగి తీసుకోవడం అనేది దేవుడు చేయడు. అందుకోసమే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ఒక ప్రవక్త అవతరిస్తారనే విశ్వాసం ముసల్మానులకు గలదు.

కాని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రం అవతరించునట్టి ప్రవక్త నా సమాజంలో నుండే అవతరించును అని స్పష్టముగా తెలిపారు. హదీస్‌లో ఈ విధముగా గలదు: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై జుమా అధ్యాయము అవతరించిన సమయంలో అనగా హుజూర్ (స) పై వ ఆఖరీన మిన్‌హుం లమ్మా యల్‌హఖూ బిహిం అనే సూక్తి అవతరించినప్పుడు ఒక అనుచరుడు, అనుచరుల స్థాయిని కల్గినట్టి వీరు, ఇంకా అనుచర వర్గీయులలో కలవని వీరు ఎవరు? అని ప్రశ్నించారు. అందుకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ సల్మాన్ ఫారసీ రజి భుజంపై చెయ్యివేసి " ఒకవేళ విశ్వాసం కృతికా నక్షత్రం వరకు చేరుకున్నా కూడ వీరిలో నుండి కొందరు ఆ విశ్వాసాన్ని తిరిగి తీసుక వస్తారు అని తెలిపారు.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ సమాధానం ద్వారా మనకు రెండు విషయాలు అర్థమవుచున్నాయి. ఒకటి అవతరించునట్టి మహాత్ముడు అరబ్‌కు చెందిన వాడు కాదు. రెండవది అతడు ముహమ్మదియ్య సమాజంలో నుండే అవతరించును.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరల ఇలా తెలిపారు: అతని రాక నా రాకను పోలియుండును. అనగా అవతరించువారు నా విధానాలకు అనుగుణముగానే నడుచుకుంటూ, నన్నే అనుసరించును అర్థం.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారం హజ్రత్ అఖ్దస్ మిర్జా గులాం అహ్మద్ అలైహిస్సలాతు వస్సలాం మసీహ్ మరియు మహ్దీగా అవతరించారని, ఎలాంటి నూతన ధర్మశాస్త్రమును తీసుకరాలేదు అనేది మా విశ్వాసం. వారు పవిత్ర ఖుర్ఆన్ బోధనలను ఎంతో వివరణ్మాతకముగా, ఉన్నత భావాలతో నేర్పించుటకు వచ్చారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత కూడ ప్రవక్త అవతరించును. కాని వారు నూతన ధర్మశాస్త్ర రహిత ప్రవక్తగానే అవతరించును. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్నబియ్యీన్ అని, పవిత్ర ఖుర్ఆన్ గ్రంథము అంతిమ ధర్మశాస్త్ర గ్రంథమని, ఇకపై ఎలాంటి నూతన ధర్మశాస్త్ర గ్రంథమలు అవతరించబోవు అనేవి మా విశ్వాసాలు. అదే విధముగా అంతిమ ధర్మశాస్త్ర ప్రవక్త మరియు ఖాతమున్నబియ్యీన్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను మేము విశ్వసించుతాము. అదే విధముగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లను అభిమానించడం వలన, వారిని అనుసరించడం వలన, ధర్మశాస్త్రరహిత ప్రవక్తలు అవతరిస్తారని కూడ మేము విశ్వసిస్తాము.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: ఒక రోజు రాత్రి నేను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై చాలా అధికముగా దరూద్ షరీఫ్‌ను పంపించాను. దాని ఫలితముగా నా మనస్సు మరియు ఆత్మ రెండు పవిత్రమయ్యాయి. ఆ రోజు రాత్రియే కలలో ఒక దృశ్యాన్ని చూశాను. దేవదూతలు తేజస్సుతో నిండి తోలు సంచులను తీసుకొని ఈ భవధీయుని ఇంట్లోకి ప్రవేశించారు. ఆపై వారిలో నుండి ఒక దేవదూత ఇవి నీవు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై పంపిన దరూద్ యొక్క శుభములు అని తెలిపారు. మరొకసారి ఈ విధముగా ఒక దైవవాణి అవతరించినది: దేవలోక ప్రజలు ఒక అన్వేషణలో ఉన్నారు. పైగా దేవుడు తన ధర్మమును పునరుద్దింపజేయాలనే ఉత్తేజంలో ఉన్నాడు. ఆ తరువాత ఒక కలలో ఈ విధముగా చూశాను. ఆ దేవలోక ప్రజలు ఒక ప్రాణదాత కొరకు అన్వేషణ ప్రారంభించారు. వారిలో ఒక వ్యక్తి ఈ భవదీయుడి ముందుకు వచ్చి, నావైపు సంజ్ఞ చేస్తూ ఇలా అన్నాడు: ఇతడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమించు వ్యక్తి. కావున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి లభించినటు వంటి ఈ స్థానము కేవలం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమించడం వలనే లభించినది.

మరల జర్నలిస్ట్ దైవవాణుల పరంపర నేటికి కొనసాగుతుందా? అని అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ ఈ విధముగా సమాధానం ఇచ్చారు: దేవుని విశిష్ట లక్షణాలన్ని నేటికి పూర్వము ఉన్నట్లుగానే ఉన్నాయని మేము విశ్వసించుతాము. దేవుని ఏ విశిష్ట లక్షణమును కూడ ఎవరు కనుమరుగు చేయలేరు. దేవుడు గతంలో కూడ సంభాషించేవాడు, నేడు కూడ సంభాషించుతున్నాడు. ప్రజలకు సత్యస్వప్నాలు కూడ వస్తుంటాయి. అల్లాహ్ తాలా దుఆలను ఆలకిస్తాడు, స్వస్థతను చేకూర్చుతాడు.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: దేవుడు మాట్లాడుతాడు. నేడు కూడ మాట్లాడుతున్నాడు. దేవుని దైవవాణుల పరంపర, సువార్త వాణుల పరంపర నేటికి కొనసాగుతూనే ఉన్నది. ఎవరు కూడ ఈ పరంపరను ఆపలేరు.

మరొక ప్రశ్నకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ఈ విధముగా సమాధానం ఇచ్చారు: నేటి రోజులలో ప్రపంచ పరిస్థితులు శోచనీయంగా ఉన్నాయి. ఇందుకు గల ముఖ్య కారణం, ప్రజలు తమను పుట్టించిన దేవుడిని విస్మరించసాగారు. అందుకే ప్రజలు దేవుని సన్నిధిలో మోకరిల్లవలెను. దేవున్ని గుర్తించాలి. ఎవరైతే దేవున్ని మర్చిపోయారో వారు ప్రాయశ్చిత్తం, పాశ్చాత్తాపం చేసుకోవలెను. మానవుడు సాటి మానవున్ని ప్రేమించాలి. పరస్పరం ప్రేమాభిమానాలతో కూడిన అనుబంధాలను పెంచుకోవాలి.

జర్నలిస్ట్ మరల ఈ విధముగా ప్రశ్నించారు: పాకిస్తాన్‌లో నిమ్న వర్గాలవారిపట్ల, నిమ్న జాతుల పట్ల వ్యవహరిస్తున్న శైలి, అక్కడ కొనసాగుచున్న హింస దృష్ట్యా అక్కడ అహ్మదియ్య ముస్లిం జమాఅత్ భవిష్యత్తు ఏ విధముగా ఉండబోతుంది?.

ఈ ప్రశ్నకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధముగా సమాధానం ఇచ్చారు: అక్కడ అన్ని విధాల దౌర్జన్యాలు, బాధలు పెట్టిన కూడ జమాఅత్ స్థిరముగానే ఉన్నది. జమాఅత్ సభ్యులు అన్ని రకాల దౌర్జన్యాలను భరిస్తూనే ఉన్నారు. ఒకవేళ అక్కడి ప్రజల దౌర్జన్యానికి వ్యతిరేకముగా అక్కడి ప్రభుత్వం మాకు సహాయం అందించినచో అది వారికే చాలా మంచిది. లేనిచో మేము దేవుని ముందే మోకరిల్లుతూ అతనికే మా ఆవేధనను తెలియపరుస్తాము. ఆయా ధౌర్జన్యాలను భరించే శక్తిలేని ప్రజలు పాకిస్తాన్ వీడి ఆస్ట్రేలియా మరియు పశ్చిమ దేశాల వైపు వలస వెళ్ళుచున్నారు. అక్కడే నివాసంను ఏర్పర్చుకుంటున్నారు. పాకిస్తాన్ దురదృష్టమేమనగా, పాకిస్తాన్‌కు చెందిన విజ్ఞానవంతులు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, ఇంజనీయర్లు వంటి మొ॥వారు పాకిస్తాన్ నుండి బయటికి వెళ్ళి పోవుచున్నారు. వారి నష్టం పాకిస్తాన్‌కు కల్గుతుంది. పాకిస్తాన్ దేశాన్ని అగ్ర స్థానంలో నిలబెట్టడం కోసం అహ్మదీయులమైన మేము చాలా కృషి చేశాము. పాకిస్తాన్‌ను ఒక శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో అహ్మదీయులు చాలా ముఖ్యమైన పాత్రను పోషించారు. ఖాయిదే ఆజం (ముహమ్మద్ అలీ జిన్నా) పాకిస్తాన్‌కు మొదటి విధేశాంగ మంత్రిగా ఒక గొప్ప అహ్మదీయులైన చౌద్రి ముహమ్మద్ జఫరుల్లాహ్ ఖాన్ రజి గారిని నియమించారు. కాని నేడు పాఠశాల విద్యార్థులు తరగతి పుస్తకాల నుండి వారి పేరును తొలిగించడం జరిగింది.

**హదీస్ వాఖ్యములు**

**"ఎవరైతే నాకు సలాంలు పంపుతారో వారికి సమాధానం ఇవ్వడం కొరకు అల్లాహ్ తాలా నా ఆత్మను తిరిగి పంపిస్తాడు. తద్వారా నేను వారి సలాంకు ప్రతి సలాంను పంపగలను"**

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)*

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*

ఇంతకు మించిన దురదృష్టం ఏమైన ఉంటుందా?.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా అనుగ్రహం వలన పాకిస్తాన్‌లో అహ్మదీయులు ఉన్నారు. ఇక ముందు కూడ వారు అక్కడే ఉంటారు. తమ తుది శ్వాస వరకు వారు అక్కడే ఉంటారు. అక్కడే ఉంటూ పోతుంటారు. దౌర్జన్యం చేయువారికి వివేకాన్ని కల్గించమని, తెలివి తేటలను ప్రసాదించమని, దౌర్జన్యం చేయుటకు వీడాలని మేము దుఆలు చేస్తుంటాము.

ఇంటెర్వ్యూకు చెందిన ఈ కార్యక్రమము 11:30 లకు ముగిసిపోయింది.

జమాఅత్‌కు చెందిన వ్యక్తులు మరియు వారి కుటుంబ సభ్యులతో హుజూర్ అన్వర్ భేటి:

ఆ తరువాత కార్యక్రమము ప్రకారం తమ కుటుంబ సభ్యులతో జమాఅత్ వ్యక్తులు భేటి కార్యక్రమము ప్రారంభించారు: నేటి ఉదయపు సేసన్స్‌లో47 కుటుంబ సభ్యులకు చెందిన 190 మంది సభ్యులు తమ ప్రియతమ హుజూర్ గారితో భేటి అయ్యే అవకాశంను పొందారు. హుజూర్ తో భేటి అయిన కుటుంబీకులు సిడ్నికి చెందిన బ్లేక్ టౌన్ మరియు మర్సడన్ పార్క్‌కు చెందిన రెండు జమాఅత్‌లకు చెందిన వారు. ఈ కుటుంబీకులందరు కార్యక్రమము తరువాత హుజూర్ అన్వర్ తో వేరు వేరుగా ఫోటోలు దిగే భాగ్యమును పొందారు. హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు కరుణా దృక్పథంతో విద్యార్థుని, విద్యార్థులకు పెన్నులు బహుకరించారు. చిన్న పిల్లలకు ప్రేమతో చాక్లేట్స్‌ను ఇచ్చారు.

భేటి కార్యక్రమము 2:30ల వరకు కొనసాగింది. ఆ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ మస్జిద్ బైతుల్ హుదా కు చేరుకొని జొహర్ మరియు అసర్ నమాజ్‌లను కలిపి చదివించారు. నమాజ్‌ల తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా తమ నివాసానికి తిరిగి వెళ్ళారు.

ఆస్ట్రేలియా మహిళ మండలి (లజ్నా ఇమాఅల్లాహ్ ) జాతీయ స్థాయి కార్యనిర్వాహక సభ్యులతో హుజూర్ అన్వర్ భేటి:-

కార్యక్రమము ప్రకారం 6 గంటల 15 నిమిషాలకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మస్జిద్ బైతుల్ హుదా చేరుకొని ఆస్ట్రేలియాకు చెందిన లజ్నా ఇమాఅల్లాహ్ కార్యవర్గ సభ్యులతో ఒక సమావేశాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే హుజూర్ అన్వర్ జర్నల్ సెక్రటరితో " మీకు మజాలిస్‌కు చెందిన మాస నివేధికలు ఏ విధముగా అందుతాయి?, వాటి నుండి మీరు ఏ విధముగా మాస నివేధికలు తయారు చేస్తారు?, నివేధికలు పంపించిన మజాలిస్‌లకు వివరణతలో కూడిన సమాధానాలు పంపిస్తుంటారా?" అని ప్రశ్నించారు. అందుకు జర్నల్ సెక్రటరి గారు ఈ విధముగా సమాధానం ఇచ్చారు: మజాలిస్ నుండి వచ్చిన నివేధికలను పరిశీలించి, వాటిపై చర్చలు జరుపుతూ వారికి సూచనలు సలహాలు పంపిస్తుంటాము. మరల హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు: సదర్ లజ్నా బాధ్యత ఏమటినగా వారు నివేధికలన్నింటిని శ్రద్దగా పరిశీలించాలి. వాటిపై చర్చించి, ఆయా శాఖలకు మరియు ఆయా మజాలిస్‌లకు సమాధానాలు పంపించాలి.

సెక్రటరి తర్బియత్‌ను కూడ హుజూర్ అన్వర్ లజ్నా ఇమాఅల్లాహ్ యొక్క సెలబస్‌ను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆపై హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: మీరు మీ మొదటి టార్గెట్‌గా ఎంచుకోవలసిన ఆంశమేమనగా, ప్రతి వారం క్రమతప్పకుండా జుమా ప్రసంగాన్ని ఎంత మంది సభ్యురాలు వింటున్నారనే విషయాన్ని చూసుకోవాలి. అదే విధముగా వివిధ దేశాలలో నిర్వహించబడే జల్సాలు మరియు ఇజ్తిమాలలో లజ్నాలను ఉద్దేశించి నేను చేయునట్టి ప్రసంగాలను కూడ ప్రతి సభ్యురాలు తప్పకుండా వినడానికి ప్రయత్నించాలి. ఈ విషయంపై కూడ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ ప్రసంగాలు, ఉపన్యాసాలను వినడం, ఆ తరువాత అందుకు అనుగుణముగా ఆచరించుటకు ప్రయత్నించడం వంటివి మహిళల క్రమ శిక్షణకు చాలా ముఖ్యం. ముందుగా మీరు క్రమశిక్షణ అలవర్చుకుంటారు, ఆ తరువాత మీ పిల్లలకు కూడ మించి క్రమశిక్షణ అలవాటైపోతుంది.

ఆ తరువాత లజ్నా సభ్యురాల్లందరు నమాజ్‌లను చదువవలెను, క్రమం తప్పకుండా ఖుర్ఆన్ మజీద్ పారయణం చేయువారు కావలెను. దీని ద్వారా మీకు దేవునితో అనుబంధము ఏర్పడుతుంది. అదే విధముగా ఇంట్లో ఉండే మహిళలు తమ భర్తలను, పిల్లలను నమాజ్ సమయానికి నమాజ్‌కు వెళ్ళమని వారికి గుర్తుచేయాలి. పైగా వారి బాధ్యత ఏమిటనగా, పిల్లలకు నమాజ్ చదివే అలవాటును నేర్పించాలి. మస్జిద్‌తో వారికి అనుబంధాన్ని పెంచాలి.

మరల హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: నా జుమా ప్రసంగాలలో నుండి మరియు నేను లజ్నాను ఉద్దేశించి చేసిన ప్రసంగాల నుండి ముఖ్యమైన విషయాలను ఎంచుకొని వాటిని ఒక సర్క్యులర్‌గా తయారు చేసి మీ లజ్నా సభ్యురాల్లకు పంపించాలి. ఈ మేయిల్ ద్వారా పంపించండి. అదే విధముగా మీ మాసపు సమావేశాలలో కూడ ఆయా సర్క్యులర్‌లను పంచిపెట్టవచ్చును.

మరల హుజూర్ అన్వర్ చందా తహ్‌రీకే జదీద్ మరియు వఖ్ఫేజదీద్‌లను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆపై మీరు ఒక టార్గెట్‌ను ఎంచుకొని ముందుకు వెళ్ళండి అని లజ్నాకు మార్గదర్శకాలు చేశారు. అందుకు హుజూర్ అన్వర్ సన్నిధిలో ఈ విధముగా తెలుపడం జరిగింది. మేము మా సభ్యురాళ్ళందరికి మరియు బాలికలకు ఇటు వైపు శ్రద్ధ కల్పిస్తున్నాము. ఎన్ని ప్రముఖమైన చందాలు ఉన్నయో వారికి గుర్తు చేయిస్తున్నాము. వాటిలో భాగస్వాములు కావాలని, క్రమం తప్పకుండా చందాలు చెల్లించాలని కూడ తెల్పుచున్నాము. అందుకు హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: లజ్నాలు సంవత్సరం మొత్తానికి ఒక టార్గెట్‌ను నిశ్చయించుకొని ఆ తరువాత సభ్యురాల్లందరి ద్వారా ఆ మొత్తాన్ని వసూలు చేస్తు మీ టార్గెట్‌ను చేరుకోవచ్చును. అదే విధముగా మీ జమాఅత్‌కు చెందిన జాతీయ స్థాయి సెక్రటరి తహ్‌రీకే జదీద్ మరియు వఖ్ఫే జదీద్‌లు దేశం మొత్తం మీద సామూహికముగా వసూలు చేసే విషయంలో మీకు సహకరిస్తు ఉన్నారు కావచ్చును. ఉపశాఖల వారు ఈ రెండు చందాలను తమ తమ టార్గెట్‌ను పూర్తి చేయు పనిలో ఉన్నచో సామూహికముగా మీ జమాఅత్ స్థానం కూడ ఆర్థిక పరంగా ఉన్నతముగానే ఉంటుంది. ఈ విధముగా కొన్ని దేశాలు, కొన్ని జమాఅత్‌లు ప్రత్యేక స్థానాలను సాధించు వాటి స్థాయికి చేరుకుంటాయి.

మరల హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: లజ్నా సభ్యురాల్లకు వారు ఎంత మొత్తంలో చందా చెల్లిస్తున్నారు, ఎందుకు చెల్లిస్తున్నారు అనే విషయం తప్పకుండా తెలియాలి. అదే విధముగా వారు తమ పిల్లలతో కూడ చందాలు ఇప్పించాలి. వారికి కూడ మీరు ఈ చందాలను దేవుని ప్రీతిని పొందడానికి చెల్లిస్తున్నారని తెలియపర్చాలి.

సెక్రటరి మాల్‌ను హుజూర్ అన్వర్ గారు లజ్నా యొక్క మొత్తం బడ్జెట్‌ను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆపై మరల ఇలా అన్నారు: లజ్నాలో ఎవరైతే చందాలు చెల్లించు విషయంలో అలసత్వం వహిస్తున్నారో వారి వెనక పడవల్సిన అవసరం ఏమిలేదు. బహుశా వారికి ఏదైన ఇబ్బంది ఉండవచ్చును అందుకే సమయానికి చందా చెల్లించకపోవచ్చును. హాఁ ఒకవేళ మీ జమాఅత్‌కు చెందిన ఏ సభ్యురాలికైన ఏదైన సమస్య ఉన్నచో దానిని మీరు తప్పకుండా పరిష్కరించుటకు ప్రయత్నించాలి.

ఆ తరువాత హుజూర్ అన్వర్ ఆడిటర్‌ను వారి పని విధానంను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆపై ఏ స్థాయి మేరకు చెకింగ్ చేస్తున్నారు అని వారి పనిని పరిశీలించారు.

ఆ తరువాత హుజూర్ అన్వర్ గారు సెక్రటరి ఖిద్మతే ఖల్క్‌ను సంవత్సరం మొత్తం కొరకు మీరు ఏ ఏ కార్యక్రమాలను రూపొందించుకున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఆపై వారికి వృధ్ధాశ్రమాలకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు వెళ్ళాలని చూసించారు. అదే విధముగా వివిధ చారిటీజ్‌ల కొరకు ఫండును సేకరించు కార్యక్రమములను ఏర్పాటు చేసుకోవాలని మార్గదర్శకాలు చేశారు.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: మీరు మానవ సేవా కార్యక్రమాలను చేసినచో, చారిటీజ్‌లకు ఫండ్‌ను సేకరించి ఇచ్చినచో ఇతర జాతుల వారికి కూడ అహ్మదియ్య జమాఅత్ మహిళ సంఘాలు ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నారు, వారు మానవ సేవా కార్యక్రమాలలో ముందున్నారు, సహాయం అందిస్తున్నారు అనే విషయం వారికి కూడ స్పష్టముగా అర్థమవుతుంది.

సెక్రటరి సనత్ వ దస్తకారి గారిని హుజూర్ అన్వర్ గారు ఆ శాఖకు చెందిన పనులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆపై హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: ఇళ్ళలో ఖాళిగా కూర్చునే పెద్ద వయస్సు మహిళలతో ఈ శాఖలో పనిచేయిటకు సహాయంను తీసుకోండి. వారు ఇళ్ళలోనే ఉంటూ వస్తువులను తయారు చేయాలి. ఆ తరువాత మీరు క్రమ బద్ధముగా వార్షిక ప్రదర్శన శాలలను నిర్వహించండి. మీనా బజార్‌ను నిర్వహించండి. ఇజ్తిమా సమయంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేయండి.

సెక్రటరి నాసిరాత్‌ను హుజూర్ అన్వర్ ముసుగు ప్రామాణికతను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆపై ఈ విధముగా మార్గదర్శకాలు ఇచ్చారు: అనగా సెక్రటరి నాసిరాత్ స్వయముగా ముసుగు విషయంలో

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 6. Thursday, 05, AUG 2021 Issue No. 31.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.575/- (Per Issue: 11/- ) (WEIGHT: 20-50, grms / issue)

నాసిరాత్‌ల కోసం ఒక గొప్ప ఉదాహరణగా నిలవాలి. ఎందుకనగా బాలికలు తమ సెక్రటరిని చూసి ఆదర్శాన్ని అనుసరిస్తుంటారు. కావున సెక్రటరి ముసుగు ప్రామాణికం బాగుగా ఉన్నచో బాలికల ముసుగు ప్రామాణికం కూడ బాగుగానే ఉంటుంది.

హుజూర్ అన్వర్ నాసిరాత్ యొుక్క పాఠ్యాంశాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. వార్షిక క్విజ్ పోటిల కోసం ఏ పుస్తకంను నిర్ణయించారు అని కూడ అడిగి తెలుసుకున్నారు. ఆపై హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: వార్షిక క్విజ్ పోటిలను తప్పకుండా నిర్వహించాలి. అదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఏదేని పుస్తకం నుండి ప్రతిసారి రెండు పుటలను కూడ పాఠ్యాంశంగా నిర్ణయించండి. మొత్తం పుస్తకాన్ని నిర్ధారించకూడదు. అలా చేసినచో నాసిరాత్‌లకు కష్టమవుతుంది.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా మరల ఈ విధముగా మార్గదర్శకాలు చేశారు: బాలికలతో వ్యాసాలు వ్రాయించండి. అందుకోసం కొన్ని శీర్షికలను తయారు చేయండి. ఉదా॥ మనం ఎందుకు అహ్మదీయులము అని పిలువబడుచున్నాము?. మరల హుజూర్ ఇలా తెలిపారు: బాలికలు తమ ధార్మిక మరియు సత్కార్య ప్రామాణికాలను పెంచుకోవాలి. పైగా ఎందుకు మనలను అహ్మదీయులు అంటారు అనే విషయం కూడ వారికి తెలియాలి. మరల హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: ఇజ్తిమాల కోసం ఎంపిక చేసే శీర్షికలు అనగా అల్లాహ్ తాలా, మన దేవుడు, ఖిలాఫత్ అహ్మదియ్య, ఖిలాఫత్ యొక్క శుభములు, మానవ సేవా కార్యక్రమాలు, ఇతరులకు సేవ చేయడం, ఇతరులకు చేయుతను అందించడం వంటి వాటిని ఎంచుకోవాలి.

మరల హుజూర్ అన్వర్ అడిగి తెలుసుకున్న విషయమేమనగా, ఆదివారపు తరగతులకు ఎంత మంది బాలికలు హాజరు అవుతున్నారు?. ఆపై హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: తరగతులలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొనునట్లు చూడవలెను. మరల హుజూర్ ఇలా తెలిపారు: 10 సంవత్సరాల కన్న పెద్ద వయస్సు బాలికలు పరస్సరం బృందాలుగా ఏర్పడి చర్చించుకోవాలి. బాలికలు ఈ విధానము ద్వారా చాలా విషయాలను త్వరగా నేర్చుకుంటారు. చర్చించుకొనుటకు కూడ శీర్షికల పేర్లు ఈ విధముగా ఉండేటట్లు చూడాలి. మనం ఎందుకు తలను కప్పుకోవాలి?. దేవుని ప్రాధాన్యత ఏమిటి?.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: చర్చావేధికల కోసం ఇతర అంశాలను ఎంపిక చేసుకోవచ్చును. తద్వారా బాలికలు తమ ఆలోచనలను, సమస్యలను, అభిప్రాయాలను వ్యక్తపర్చగల్గుతారు. వాటి ద్వారా వారి సంస్కరణకు అవకాశాలు కూడ దక్కుతాయి. ఉదా॥ వివాహ్ వేడుకలు, భర్త, పిల్లలు, విడిపోయినా భార్య, భర్తలు. ముసుగు, బంధువులను గౌరవించడం వంటివి. ఇలాంటి అంశాలపై చర్చించుకున్నచో బాలికలకు ఆయా సమస్యలను గూర్చి అవగాహన పెరుగుతుంది. పైగా మనం వారి సమస్యలను, ఇబ్బందులను దూరం చేయడంలో సలహాలు సూచనలు ఇవ్వగల్గుతాము. వారికి అనేక విషయాలలో ఇస్లామీయ బోధనలను గూర్చి అవగాహన కల్పించవచ్చును.

హుజూర్ అన్వర్ సదర్ లజ్నా ఇమా అల్లాహ్‌కు కొన్ని మార్గదర్శకాలు చేశారు. చదవం, వ్రాయడం వచ్చిన మహిళలు మరియు విద్యావంతురాల్లతో ఒక కమిటిని ఏర్పాటు చేయండి. ఈ కమిటి కోసం వివిధ రంగాలకు చెందిన మహిళ సభ్యురాల్లను ఎంచుకోండి. కమిటి సభ్యురాల్లు చర్చావేధిక కొరకు ఏయే ఏయే ప్రాంతాలను ఎంచుకోవాలి అనే విషయాన్ని నిర్ణయిస్తారు. పిల్లలతో ఏ విధముగా ఈ అంశాలపై చర్చింప జేయాలి అనే ప్రణాళికలు రూపొందిస్తుంటారు.

లజ్నా చదవడం కోసం ఏయే ఏయే పుస్తకాలను పాఠ్య ప్రణాళికగా నిర్ణయించారు అని హుజూర్ అన్వర్ సెక్రటరి తాలీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. అందుకు సెక్రటరి గారు ఈ విధముగా సమాధానం ఇచ్చారు: హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి రచన " లెక్చర్ లుధియానా "ను మరియు తఫ్సీర్ ఖుర్ఆన్ మరియు ఖుర్ఆన్ కరీం పఠనమును పాఠ్యంశముగా నిర్ణయించాము. అందుకు హుజూర్ అన్వర్ గారు ఆయా కార్యక్రమాలలో మరియు సమావేశాలలో లజ్నా అధికముగా పాల్గొనునట్లు చూడాలని సూచనలు ఇచ్చారు.

సెక్రటరి జియాఫత్: హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ మరల ఈ విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తయారు చేయబడుచున్న వంటలను లజ్నా వారు వేరుగా వండిస్తున్నారా? లేకా జమాఅత్ పరంగా అందరికి కలిపి జమాఅత్‌యే వండిస్తుందా? అని అడిగి తెలుసుకోగా, అందుకు సెక్రటరి జమాఅత్ బృందమే అందరికి వంటలు వండి పంపిస్తున్నారు అని సమాధానం ఇచ్చారు.

సెక్రటరి ఇషాఅత్: హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా అడిగిన ప్రశ్నకు సెక్రటరి ఇషాఅత్ ఈ విధముగా సమాధానం ఇచ్చారు: లజ్నాకు చెందిన సంచిక అజ్జుహా మరియు అల్ మిజాన్ ప్రచురించబడుతున్నాయి. హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: వాఖిఫాతే నౌ కోసం లండన్‌లో ప్రచురించబడుతున్న మరియం సంచికకు మీ ప్రాంతంలో కూడ కొనుగోలు దారులను చేయండి. క్రమం తప్పకుండా ఈ సంచికను తెప్పించుకోండి. ఆపై మీరు మీ సభ్యురాల్లలో ఈ సంచికను పంచిపెట్టుకోండి. అధిక సంఖ్యలో తెప్పించుకోండి. ఆ తరువాత హుజూర్ అన్వర్ లజ్నా యొక్క వెబ్‌సైట్‌ను గూర్చి దానిని మీరు ఏ విధముగా నడిపిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు.

మరల హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: లజ్నా తన వెబ్‌సైట్‌ను నడిపించాలి. దానిని కొనసాగించు క్రమంలో బాలికల నుండి సహాయంను తీసుకోవాలి.

హుజూర్ అన్వర్ సెక్రటరి తబ్లీఘ్‌ను ఈ సంవత్సరం ఎన్ని బైఅత్‌లు చేయించారు అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆపై హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: సాంప్రదాయబద్దమైన మహిళ బృందాలతో పరిచయాన్ని పెంచుకోండి. తద్వారా ప్రచారం కొరకు మార్గాలు కూడ తెరుచుకుంటాయి. అదే విధముగా మీ ప్రాంతంలో ఉన్నటు వంటి పాఠశాలను సందర్శించండి. వారితో మీ ప్రచార సంబంధాలను కొనసాగించండి. హుజూర్ అన్వర్ ఈ సంవత్సరపు ఆస్ట్రేలియా లజ్నా కోసం 5 బైఅత్‌లను టార్గెట్‌గా ఇచ్చారు. హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: మీరు మీ కోసం ఇంతకన్న అధికముగా టార్గెట్‌ను చేసుకోండి. టార్గెట్‌ను అధికముగా చేసుకున్నచో చివరికి కొంత మేరకైన ఫలితాలను పొందవచ్చును.

సెక్రటరి తర్బియత్ బరాయే నౌ ముబాయిన్: నూతన అహ్మదీయ మహిళ క్రమశిక్షణల సెక్రటరి. ఇప్పటి వరకు ఎంత మంది నూతన అహ్మదియ్య మహిళలు మీ నుండి శిక్షణ తరగతులను పొందుచున్నారు?, వారి పూర్వపు సాంప్రదాయాలు, సంసృతులు ఏమిటి?, వారు ఏ అంశంతో సంతృప్తి చెంది అహ్మదియ్యత్‌ను స్వీకరించారు? అని హుజూర్ అన్వర్ సెక్రటరిని అడిగి తెలుసుకున్నారు.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: నూతన అహ్మదీయులు జమాఅత్ విధి విధానాలలో పూర్తి స్థాయిలో కలిసిపోవునట్లుగా చూడాలి. లేనిచో వీరు మరల దూరం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

(రాబోవు సంచికలో చదవండి).




AL ISLAM
Al Islam - Official website of Ahmadiyya Muslim Community

AHMADIPEDIA
AhmadiPedia.ORG is an official publication of the Worldwide Ahmadiyya Muslim Jamaat, edited and managed by the Ahmadiyya Archive & Research Centre.
Search

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz